ఏప్రిల్ - జూన్ 2007

# పల్లె సృజన

సంపుటి -1 సంచిక-4

హనీబీఎపి

## 'పల్లెసృజన' తెలుగు వెలుగులు




నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్

# 'హనీబీఏపి' ప్రగతి

'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ.. హనీబీనెట్‌వర్క్‌ను ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) సంస్థకు, మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలకు సంధానం చేయడం ఈ హనీబీఏపి సంస్థ మూలకార్యక్రమం.

నవంబర్ 2005లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.ఎల్. రావు గారు, శ్రీ పి. చంద్రకాంత శర్మల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా, గారిని ఆదర్శంగా, వారి మహత్తర సృజనాత్మక ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమైన హనీబీఏపి 'ఇంతింతై వటుడింతై....' అన్నట్టుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతోమంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడు వచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్‌ని అందించాయి. అందరి తోడు శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీ' పునాదులను పటిష్టం చేశాయి.

ఇంతవరకు హనీబీఏపి చేపట్టిన, సాధించిన వివిధ కార్యక్రమాలు :

- ◆ 36 మంది ఇన్నోవేటర్స్‌ను మన రాష్ట్రంలో వెతికి వెలుగులోకి తేవడం.
- ◆ వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్.ఐ.ఎఫ్.లో రిజిష్టర్ చేయడం.
- ◆ ఒక ఇన్నోవేటర్‌కు ఆర్థిక సహాయం చేసి ఉత్పత్తి చేసి తానే అమ్మగలిగే శక్తిని కల్పించడం.
- ◆ ముగ్గురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామికవేత్తలకు అందించి, ఆర్థికపరంగా ఒప్పందం కుదర్చటం.
- ◆ నలుగురు ఇన్నోవేటర్స్‌ను అహమ్మదాబాద్‌లో జరిగిన జాతీయ సెమినార్‌కు పంపడం, వారికి లభించిన ఆదరణ, గౌరవం, సత్కారం తెలుగు ప్రజలకే గర్వకారణం.
- ◆ అయిదుగు ఇన్నోవేటర్లను NAARM లోని శిక్షణా సంస్థలో వారి ఆవిష్కరణలను ప్రదర్శింపజేయడం.
- ◆ వందలకొద్దీ తెలుగు ప్రజలతో టెలిఫోన్‌లో హనీబీ గురించి చర్చించడం.
- ◆ 'వెలుగు', RIAD, EGS, NAARM, NIT, WASSAN, CSA, CWS లాంటి సంస్థలతో కలిసి పని చేయడం.
- ◆ గ్రామ ప్రజల సృజనాత్మక ఆవిష్కరణలకు, సాంప్రదాయ విజ్ఞాన శోధనకు జరిగే పోటీల గురించి పదివేల కరపత్రాలను రాష్ట్రమంతటా పంచడం.
- ◆ గ్రామీణ ఇన్నోవేటర్లకు ఉచిత సాంకేతిక మార్గదర్శకత్వానికి ముందుకు వచ్చిన ఎన్.ఐ.టి. వరంల్‌తో సంధానం. లాభపడిన అయిదుగురు తెలుగు ఇన్నోవేటర్లు.
- ◆ General Electric, India Innovation Centre, సికింద్రాబాద్‌లో ముగ్గురు ఇన్నోవేటర్ల ప్రదర్శన.
- ◆ పారిశ్రామిక వేత్తలు, అనధికార సంస్థలతో రాష్ట్ర ఉన్నతాధికారులు పద్మశ్రీ అనిల్ గుప్తా సమక్షంలో 12 మంది తెలుగు ఇన్నోవేటర్ల ఆవిష్కరణల ప్రదర్శన.
- ◆ ఒక ఆవిష్కరణ విస్తారానికి, టెస్టింగ్‌కు, ఐ.ఇ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.
- ◆ జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.
- ◆ మినీ శోధయాత్ర నిజామాబాద్ ప్రాంతంలో నిర్వహించి, ఏడుమంది పల్లె ఇన్నోవేటర్లను కలుసుకుని వారి సృజనలను గురించి తెలుసుకోవటం.

ఈ స్థాయికి రావడానికి సంపూర్తిగా సహకరించిన ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారికి, ఎన్.ఐ.ఎఫ్. అహమ్మదాబాద్ సంస్థలోని ప్రతి ఒక్కరికి, పాత్రికేయులకు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంస్థలకు, ప్రభుత్వేతర సంస్థలకు, స్వచ్ఛంద సంస్థలకు, సృజనాత్మకత కలిగిన తెలుగు ప్రజలకు హనీబీ కృతజ్ఞతలు.


**మా కలలు :**

- ◆ ఆరవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.
- ◆ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి బహుమతులు రావాలని మనసారా ఆశించడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి – ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

– బ్రిగేడియర్ గణేశం, కో–ఆర్డినేటర్, హనీబీఏపి, ఫోన్ : 040–27118555

## హనీబీఏపి సారథులు



బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం



డా|| కె.ఎల్. రావు



శ్రీ పి.సి. శర్మ

# ఈ సంచికలో....

**కవర్ లోపలి పేజీల్లో :**
☛ హనీబీఏపి ప్రగతి ☛ సునాయాసంగా చిన్న కాలువ త్రవ్వే యంత్రం


☛ ముఖపత్ర పరిచయం 3
☛ మార్చండి మన బస్సులు 4
☛ కుంకుబెన్ కష్టాల గాథ 5
☛ నిజామాబాద్ జిల్లాలో మినీ శోధయాత్ర– అద్భుత అనుభవాలు 7
☛ ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు 10
☛ కారంచేడు అనుభవాలు 13
☛ ప్రత్తి పంట సస్యరక్షణ 17
☛ వాటర్ పాకెట్స్ 18
☛ ప్రకాశం జిల్లా కారంచేడులో గ్రామీణ ప్రగతి ప్రదర్శన 19
☛ పులిపిర్లకు సాంప్రదాయ వైద్యం 21
☛ ఇన్నోవేషన్ల వ్యాప్తికై స్టూడెంట్ క్లబ్బులు 22
☛ శ్రీనివాస్ సృష్టి – 'శ్రీ' ఎలక్ట్రానిక్ లాకింగ్ 20
☛ ఐ.టి. పల్లెబాట పడితే 24
☛ నా అహ్మదాబాద్ అనుభవాలు – 2 25
☛ స్పందన 26
☛ కదలిరా రైతన్నా 27



**సంపాదక వర్గం**

సంపాదకుడు:
**డా. కె.ఎల్. రావు**

ఉప సంపాదకులు :
**శ్రీమతి అరుణ గణేశం**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**
**డా. గీర్వాణి**
**డా. వై.వి. రావ్**
**డా. బాల శ్రీనివాసమూర్తి**
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

డి.టి.పి. & డిజైనింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 30627739,
సెల్ : 93913 75655, 92461 63328

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లె సృజన – శ్రీమతి పి. అరుణ
55, వాయుపురి, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27118555
e-mail : honeybeeap@gmail.com


## Honey Bee Regional Collaborators & Publications

*Honey Bee*
**C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India.
Ph. : 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org.
http://www.sristi.org.

***Aama Akha Pakha*** **(Oriya)**
**Dr Balaram Sahu,**
3R BP 5/2, BP Colony,
Unit-8, Bhubaneswar-751012,
Orissa.
balaram_sahu@hotmail.com

***Hittalagida*** **(Kannada)**
**Dr T N Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Science,
GKVK, Bangalore-560065,
prakashtnk@yahoo.com

***Ini Karshakan Samsarikkatte***
**(Malayalam)**
**James T J,**
Peermade Development Society,
Peermade, Idukki-685531, Kerala.
pedes@md2.vsnl.net.in

***Loksarvani*** **(Gujarati) and**
***Sujh-Bujh Aas Paas ki*** **(Hindi)**
SRISTI, P O Box No. 15050,
Ambawadi, Ahmedabad-380015.
loksarvani@sristi.org
sujhbujh@sristi.org

***Num Vali Velanmai*** **(Tamil)**
**P Vivekanandan,**
45, T P M Nagar,
Virattipathu-625010
Tamil Nadu.
numvali@vsnl.com


Printed & Published by : Dr. K.L. Rao, on behalf of "Honey BeeA.P.", 55, Vayupuri, Secunderabad - 500 094. A.P.
Ph. : 040-27118555
Printed at : Narendra Grafix, Chikkadpally, Hyderabad. Ph. : 55463328, 27623328

# సంపాదకీయం

పల్లె సృజన ఈ సంచికతో ప్రథమ వార్షికం పూర్తి చేసుకోబోతున్నది. ఈ ప్రథమ చరణంలో పసిపిల్లలా తప్పటడుగులు వేస్తూ నిలదొక్కుకుంటూ తన కాళ్ళమీద నిలవడానికి ప్రయత్నిస్తున్న చిన్నారి స్థితి ఈ 'పల్లె సృజన'ది కూడా.

మే 18, 2006లో ప్రొ॥ అనిల్ గుప్తా గారు ప్రారంభించిన ప్రథమ సంచిక పేరు "హనీబీ". ఈ పత్రికకు తెలుగుతనాన్ని జోడించాలన్న ఆశతో రెండవ సంచికనుండి ఈ పత్రికకు "పల్లెసృజన" అని నామకరణం చేయడం జరిగింది. హనీబీపీపి ప్రగతి, తెలుగు ఇన్నోవేటర్ల లాంటి కొత్త అంశాలు ప్రతి సంచికలో పాఠకులకందిస్తున్నాం. కొత్త కొత్త ఆవిష్కరణలు, ఇతర రాష్ట్రాల ఇన్నోవేషన్లు ఎన్ఐఎఫ్ కార్యక్రమాలు, శోధయాత్రల వివరాలు పల్లె సృజన పాఠకులకు అందిస్తున్నాం.

ఏప్రిల్‌లో నిజామాబాద్ ప్రాంతంలో జరిగిన మినీ శోధయాత్ర వివరాలు, యాత్రలో పాల్గొన్న వాలంటీర్ల స్పందనను ఈ సంచికలో ప్రచురించాం. అలాగే కారంచేడులో జరిగిన "జాతీయ గ్రామీణ ప్రదర్శన" వివరాలను కూడా మీకందించే ప్రయత్నం చేసాం. ఈ ప్రదర్శనకు ఎన్.ఐ.ఎఫ్. వారి సహాయం, మార్గదర్శకత్వం, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన 36 మంది ఇన్నోవేటర్ల ఉత్సాహం, శ్రమ అన్నీ తీపి అనుభవాలు. మాకు మరువలేని ఘట్టాలు.

అయిదవ ద్వైవార్షిక పోటీల ఎంట్రీల వివరాలను సేకరించడానికి ఎన్.ఐ.ఎఫ్., హనీబీ వాలంటీర్లు రాష్ట్రంలో మూల మూలలా సంచరించి, ఇన్నోవేటర్లతో చర్చలు జరిపి వారి ఆవిష్కరణల నుంచి సరియైన సమాచారం సేకరించారు. ఇన్నోవేటర్లు వాలంటీర్లకు ఇచ్చిన వివరాలపై వారి ఇన్నోవేషన్‌ను రాష్ట్రీయ బహుమతికై అర్హత నిర్ణయిస్తారు.

జులై 9వ తేదీన ప్రొ॥ అనిల్ గుప్తా గారు హైదరాబాద్‌లో మరోసారి తెలుగు ఇన్నోవేటర్లతో ముఖాముఖి జరిపారు. ఆరోజు సాయంత్రం ఎంతో ఆనందంగా, ఉత్సాహవంతంగా గడిచింది. ఈ సమావేశం హనీబీపీపికి మరిన్ని సౌలభ్యాలను తెచ్చి పెడుతుందని విశ్వసిస్తున్నాం.

గత మూడు సంచికలకు లభించిన ఆదరణ, ప్రోత్సాహం మరువలేనిది. గ్రామీణ వాతావరణంలో పదవ తరగతి కూడా చదవని కొందరు సృజనాత్మక శక్తితో చేసిన సృష్టిని గుర్తించి, సమాజానికి అందించడంలో మేము కొంతవరకు సఫలయ్యాము.

మే నెలలో కారంచేడులో జరిగిన జాతీయ రైతు సభలలో 'పల్లెసృజన'కు వందలమంది రైతుల పరిచయ భాగ్యం లభించింది. ఈ కార్యక్రమానికి ఇన్నోవేటర్లు, వాలంటీర్లు ఎంతో దూరంనుండి వచ్చారు.

మన ఇన్నోవేటర్లు శ్రీ బంగార్రాజు, నరసింహాచారి, లింగబ్రహ్మంలకు పారిశ్రామిక వేత్తల ప్రోత్సాహం లభించింది. వారి జీవనోపాధికి సహకారం, ప్రశంసలు లభించాయి. ఆర్థికంగా, సామాజికంగా ఈ గ్రామీణ ఇన్నోవేటర్లు అభివృద్ధి పథంలో సాగుతున్నారు.

మరొక్కసారి మీకు ఆరవ ద్వైవార్షిక పోటీల గురించి గుర్తు చేస్తూ, మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞతలతో...

భవదీయ

**కే.ఎల్. రావు**


## గ్రామీణ సృజనాశక్తి వేదిక 'పల్లెస్సృజన'

పల్లె సృజన ఒక వేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ప్రార్థిస్తున్నాం.

– సంపాదక వర్గం.

# ముఖపత్ర పరిచయం

*గత 18 మాసాలుగా 'హనీబీఎపి' వాలంటీర్ల ద్వారా వెలుగులోకి వచ్చిన కొంతమంది తెలుగు ఇన్నోవేటర్లను మా పాఠకులకు అందించాలన్న ప్రయత్నమే ఈ ముఖ చిత్రం. క్రింద వారి పేర, జిల్లా వివరాలను మీకందిస్తున్నాం.*




1. రాజలింగం, కరీంనగర్ జిల్లా
2. పరమహంస, పశ్చిమ గోదావరి
3. డా. ఎ. చలం, చిత్తూరు జిల్లా
4. కిషన్ పవార్, మెదక్ జిల్లా
5. నర్సింహాచారి, నిజామాబాద్
6. సత్యనారాయణ, హైదరాబాద్
7. రాజమ్మ, మెదక్ జిల్లా
8. బంగార్రాజు, కర్నూలు జిల్లా
9. కొర్రా క్రిష్ణారావు, విశాఖ పట్నం
10. సుభాన్, గుంటూరు జిల్లా
11. ఉప్పుతేళ్ళ కృష్ణ, ప్రకాశం జిల్లా
12. సైదా, గుంటూరు జిల్లా
13. స్రవంతి, నిజామాబాద్ జిల్లా
14. విక్రం రాథోడ్, ఆదిలాబాద్ జిల్లా
15. రమణారెడ్డి, నిజామాబాద్ జిల్లా
16. శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా
17. సౌమ్య, నిజామాబాద్ జిల్లా
18. చంద్రశేఖర్, చిత్తూరు జిల్లా
19. స్వాతి, నిజామాబాద్ జిల్లా
20. భూమయ్యాచారి, నిజామాబాద్ జిల్లా
21. క్రిష్ణ, కృష్ణాజిల్లా
22. శ్రీనివాస రావు, ఖమ్మం జిల్లా
23. అన్నారావు, కరీంనగర్ జిల్లా
24. శ్రీకాంత్, నిజామాబాద్ జిల్లా
25. మోహన్, నిజామాబాద్ జిల్లా
26. లింగబ్రహ్మం, వరంగల్ జిల్లా
27. గణపతి, నిజామాబాద్ జిల్లా

సౌలభ్యం


# మార్చండి మన బస్సులు!


నేను కొన్ని అనివార్య కారణాలవల్ల గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వు చేయించుకున్న టికెట్‌ను కేన్సిల్ చేయించుకుని అత్యవసర పరిస్థితుల్లో అదేరోజు రాత్రి హైదరాబాద్ నుండి వైజాగ్‌కు 'వోల్వో' సెమీ స్లీపర్ బస్సులో వెళ్ళ వలసి వచ్చింది. నా వయస్సు 74 సంవత్సరాలు. ఇంతవరకు నేను బస్సు ప్రయాణం రాత్రిళ్లలో చేయలేదు. ఉన్న ట్రైన్ కేన్సిల్ చేయించుకుని బస్సు ప్రయాణం ఆఖరు ఘడియలో చేయడం వల్ల నా టికెట్ నెం. 38, ఆఖరు సీటు (బేక్ సేటు), కాళ్ళు చాపుకోవడానికి లేదు. ఈ ప్రయాణంలో నేను కొన్ని సమస్యలను ఎదుర్కొన్నాను. మారుతున్న టెక్నాలజీ దృష్ట్యా వాటిని వివరిస్తున్నాను.

మధ్యలో ఒక్కచోటే బస్సు ఆపారు. అక్కడ స్త్రీలకు మరుగుదొడ్డి కాదుగదా మరుగు స్థలం కూడా లేదు. రాత్రంతా ప్రయాణం – నేను రాత్రిలో రెండుసార్లయినా యూరిన్‌కి లేస్తాను. ఉదయం వైజాగ్ వెళ్ళేసప్పటికి పాదాలు వాచిపోయాయి. అక్కడకీ డ్రైవర్‌కి బస్సు ఆపమని అడగగా అనకాపల్లి తర్వాత కాస్త ఆపాడు.

నేను చెప్పే విషయమేమంటే ఓల్వో, హైటెక్, సెమీ స్లీపర్, వీడియో కోచ్ లని ప్రయాణ సౌకర్యమైతే ఏర్పాటు చేస్తున్నారే కాని, దూర ప్రాంతాలకు రాత్రంతా ప్రయాణం చేసేటప్పుడు ప్రయాణీకుల 'కాల్ ఆఫ్ నేచర్' గూర్చి ఆలోచించలేదెందుకు? ముఖ్యంగా స్త్రీలు, వృద్ధుల విషయంలో ఆలోచించలేదెందుకు? వారు అలా ప్రయాణించరనా? అసలు హైటెక్ బస్ నిర్మాణం లోనే అంటే బస్ బాడీబిల్డింగ్ లోనే ఆ టెక్నిక్ వాడాలి. అత్యవసర పరిస్థితుల్లో వాడుటకై ఒక చిన్నపాటి బాత్‌రూంను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా వుంది. ఎక్స్‌ప్రెస్ బస్సులు రాత్రి ప్రయాణంలో సాధారణంగా ఎక్కడా ఆగవు. ప్రయాణీకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వారి సౌకర్యార్థం బస్ నిర్మాణం జరపాలి. లగ్జరీ కాదు, రాత్రులు నిద్ర మానుకుని వీడియో చూసే ఓపిక దాదాపు ఎవరికీ వుండదు. ఎలా నిర్మాణం చేస్తే ఎలా పని చేయగలదో కొంతవరకు నా అభిప్రాయాన్ని సూచిస్తున్నాను, గమనించ గలరు. ఆచరణ యోగ్యమైనదిగా, ప్రయోగాత్మకంగా చేయగలిగితే బస్ నిర్మాణంచేసే కంపెనీలకు తెలుపగలరు.

1947 నాటి బస్సులు : బొగ్గుతో నడుపబడేవి




పూర్వం బస్సులు బొగ్గుతో నడిచేవి. ఈ బస్సును నడిపించడానికి వేసే బొగ్గుకు సంబంధించిన ఒక యూనిట్ బస్సు వెనుక భాగంలో వుండేది. ఆ యూనిట్ మాదిరిగానే నేటి బస్సులలో వెనుకవైపున ఒక చిన్నపాటి బాత్రూం (లెట్రిన్) క్యాబిన్ ఏర్పాటు చేస్తే నాలాంటి వృద్ధులు, మహిళలు ఆ బాత్‌రూం లోనే అత్యవసర పరిస్థితుల్లో ప్రకృతి కార్యాలను ముగించుకుని మరింత సుఖవంతమైన ప్రయాణాన్ని అందించగలరని నేను ఆశిస్తున్నాను.

●

**డా. బి.యన్. రత్నమణి,**
హైదరాబాద్.

## తలలో 'పేలు' ఇక మాయం!

ఆడవారు, బాగా జుట్టున్న మగవారిని కూడా 'పేలు' బాగా ఇబ్బంది పెడుతూ వుంటాయి. వాటికి ఎన్నో రకాల కంపెనీల మందులు, అయిల్స్ మనముందున్నాయి. కాని వాటివల్ల దురద, కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ వుండే అవకాశముంది. కాని మన ఇంట్లోనే మనము ప్రకృతి నుండి వచ్చే పండ్ల గింజల నుండి తయారు చేసుకునే వైద్యం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావు సరికదా, పేలను సమర్థవంతంగా నిర్మూలించుకొనవచ్చు.

సీతాఫలం పండు తిన్న తర్వాత వాటి గింజలను ఎండబెట్టి నిల్వ వుంచుకోవాలి. కావలసినప్పుడు వాటిని పొడి చేసి కొబ్బరి నూనెతో కలిపి జుట్టుకు వ్రాయాలి. వ్రాసిన 30 నిమిషాల తర్వాత ఆ పేలు చనిపోతాయి. మీరు తల స్నానం చేసిన యెడల పూర్తిగా పేలనుండి పైసా ఖర్చు లేకుండా విముక్తి పొందినట్లే.

– కె. సింధు, మంచుకొండ, ఖమ్మం అర్బన్ మండలం.
ఫోన్ : 08742 – 277682.

# కుంకుబెన్ కష్టాల గాథ

ఎదురీత

అది గుజరాత్ లోని చిన్న గ్రామము. అక్కడ నివసించే 'కుంకుబెన్' జీవితం సాఫీగా ఏమీ సాగలేదు. 14, 16 సంవత్సరాల ప్రాయంలో అక్క చనిపోతే అక్క భర్తకి ఇచ్చి కుంకూ వివాహం జరిపించారు ఆమె తల్లిదండ్రులు. వివాహం తరువాత కొంత కాలం భర్తకు చేదోడు వాదోడుగా వుంటూ ఆమె జీవితం సాఫీగానే జరిగింది. ఉన్న కొద్దిపాటి పొలంలో గోధుమ, బార్లీ, పత్తి లాంటివి పండించు కుంటూ, పాడి పశువులతో సుఖంగా సంసారం సాగించింది. నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు కూడా జన్మించారు.

ఇంతలో మొదలైంది, ఆమె జీవితంలో కష్టాల పరంపర. ఒక్కసారిగా విరుచుకు పడిన కరువు వల్ల పంటలు లేక గొడ్లు పొలము అమ్ముకోవలసి వచ్చింది. జీవనోపాధి లేక కుటుంబం అంతా పట్నం వలస వెళ్ళారు. అక్కడ రోజు కూలీగా జీవితం సాగించాలని ప్రయత్నించినా అది ఎంతో కాలం సాగలేదు. 2 సంవత్సరాల్లో మళ్ళీ పల్లెకు తిరిగి వచ్చారు. ఆ పట్టణ జీవితం గురించి, అక్కడి సముద్రం గురించి కుంకుబెన్‌ని అడిగితే "మేము పనికోసం వెతుక్కుంటూ పట్నం వెళ్ళాము. అక్కడి అందచందాలు గాని, వింతలు విశేషాలు గాని మా దృష్టికి వచ్చేవి కావు" అని సమాధానం చెబుతుంది.

కౌలుకు తీసుకున్న పొలం సాగు చేయటానికి భార్యా భర్తలు ఇద్దరూ చాలా కష్టపడేవారు. తెల్లవారుఝామున నిద్రలేచి ధాన్యం దంచి, విసిరి, పిండిచేసి రొట్టెలు చేసి, మేకల పాలు పితికి, పిల్లలకు కావలసినవి తయారు చేసి, ఇంటి పనులు పూర్తి చేసుకుని పొలానికి బయలుదేరితే పొద్దువాలే దాక అక్కడే కష్టపడేది కుంకూ. సాయంత్రం ఇల్లు చేరి, వంట చేసుకుని, పిల్లలకు పెట్టి, తను తినేసరికి చాలా రాత్రి అయ్యేది.

ఎలాగో ఒకలా సాగిస్తున్న ఆమె



జీవితంలో అనుకోని పెద్ద దెబ్బ ఆమె భర్త మరణం. ఈ పిడుగుపాటుకు తట్టుకుని ఆరుగురు పిల్లలతో జీవితం సాగించటం చాలా కష్టమయింది. సంకుచిత భావాలు, మూఢ నమ్మకాలతో నిండిన మనుషులున్న ఈ సంఘం విధవరాలైన ఆమెను చాలా చిన్న చూపు చూసింది. సూటిపోటి మాటలతో బాధించింది. చిన్న వయసులో అక్క మరణానికి బావని బాధ్యుని చేయలేదు గాని, అదే మనుషులు భర్త మరణానికి కుంకూనే బాధ్యురాలిగా ముద్రవేశారు. వింతంతువైన ఆమెను ఆమె బావ డబ్బుకోసం చీటికి మాటికీ ఏదో ఒక మిషతో తగవులాడటం సాగించేవాడు. ఈ బాధలు భరించలేక ఆమె తను పనిచేసే ఇంటి యజమాని సాయంతో పూరి పంచాయితీలో తన బాధలు విన్నవించుకుని వారి ద్వారా ఈ బాధనుంచి విముక్తురాలయింది.

ఇన్ని బాధలు పడుతున్నా ఆమె ఏనాడూ ఎవరినీ ఎదిరించలేదు. వితంతవుగా తన కష్టాలకు కారణమైన ఈ సంఘాన్ని తప్పు పట్టలేదు. "సంఘం కట్టుబాట్లను గౌరవించటం మన బాధ్యత. అంతేగాని వాటిని ఎదిరించి ప్రయత్నించ కూడదు. అన్నది ఆమె స్థిర అభిప్రాయం. తను ఎంత నమ్మకంతో సంఘాన్ని గౌరవిస్తుందో, అంతే గౌరవంతో తన పిల్లలు వుండాలని ఆమె కోరుకుంటుంది.

భర్త లేక పిల్లలతో నానా బాధలు పడుతున్న ఆమెపై అత్త మామలకు కూడా సానుభూతి లేక వదిలి వేశారు. ఒంటరిగానే ఆమె జీవన పోరాటం సాగించింది. పొలంలో పనికి వెళ్ళేటప్పుడు ఇంట్లో చూసే దిక్కులేక చిన్న పిల్లలను తనతో వెంట తీసుకుని వెళ్ళేది. తనకు నలుగురు అన్నదమ్ములు వున్నా వారిని ఏనాడూ సాయం కోరలేదు కుంకూ. అన్ని బాధలను కడుపులో దాచుకుని భారత మహిళకు సహజ లక్షణమైన ధైర్యం, సాహసం, సహనం, అభిమానం తోడుగా సాంప్రదాయాన్ని గౌరవిస్తూ బ్రతుకు భారాన్ని మోసిన కంకూబెన్ ఆదర్శ స్త్రీగా కొనియాడదగినది. ఎవరైనా ఆమె మనస్థైర్యాన్ని మెచ్చుకోబోయినా ఆమె అందుకు అంగీకరించదు. 'నా పెద్దపొట్టలో ఎన్ని కష్టాలయినా దాచుకోగలను' అని చిరునవ్వుతో చెబుతుంది.

నిరక్షరాస్యురాలైన కుంకూ తన పిల్లలు అలా కాకూడదని వాళ్ళను చదివించింది. ప్రస్తుతం ఆమె కొడుకుల్లో ఒకరు పి.డబ్ల్యు.డి.లోను, ఇంకొకరు "లాల్‌బస్" (ఆర్.టి.సి.) లోను పని చేస్తున్నారని గర్వంగా చెప్పుకుంటుంది. జీవితం అంతా ఇంటికోసం, పిల్లల కోసం, కష్టపడిన కుంకూకి ఒక తీరని కోరిక.

# అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఎన్.ఐ.ఎఫ్. పురస్కార గ్రహీతలు

శ్రీ కనకదాస్, మరియు శ్రీ ధర్మేంద్ర పాటిదార్ తమ నూతన పద్ధతుల అన్వేషణ మరియు అమలు విషయంలో ఎన్ఐఎఫ్ పురస్కారములు పొందుట వలన అంతర్జాతీయ గుర్తింపు పొందగలిగిరి. అమెరికాలోని కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయానికి చెందిన మసాచు సెట్స్ ఇన్‌స్టిట్యూట్ వారు అందించే గ్లోబల్ ఇండస్ టెక్నోవేటర్స్ పురస్కారానికి వీరి పేర్లు ప్రతిపాదించ బడినవి.

ఈ పురస్కారాలు ఇండస్ రీజియన్ (ఇండియా, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్)లో పేరు పొందిన నూతన పద్ధతుల అన్వేషణ మరియు అమలు చేయుటలో నిష్ణాతులైన వారిని సత్కరించటానికి నిర్దేశింపబడినవి. ఈ పురస్కారము మూలంగా ఇండర్ రీజియన్ లోని సృజనాత్మక, మరియు నూతన పద్ధతుల అన్వేషణ చేయు ఔత్సాహి కులకు, మరియు దక్షిణ ఆసియా లోని యువతకు బాగా గుర్తింపు లభిస్తుంది.

కనకదాస్ కనుగొన్న శక్తిని ఉత్పత్తి చేసే బైసికిల్ మరియు ధర్మేంద్ర పాటిదార్ యొక్క బ్యాటరీ ఆధారంగా పనిచేసే విత్తనాలు వెదజల్లే యంత్రము గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్ విభాగంలో ఈ పురస్కారానికి ఎన్నుకోబడినవి.

ఎన్ఐఎఫ్ వార్షిక పురస్కారా లలో కనకదాస్‌కు విద్యుత్ శాఖ విభాగం లో ప్రథమ బహుమతి, మరియు ధర్మేంద్ర పాటిదార్‌కు రెండవ వార్షిక పోటీలలో ప్రోత్సాహక బహుమతులు లభించినవి.

ఎప్పటికైనా పిల్లలుగాని, మనుమలు గాని తన కోరిక తీరుస్తారని ఎదురు చూస్తుంది.

ప్రస్తుతం కుంకుబెన్ వయస్సు 90



సంవత్సరాలు. అయినా ఆమెకు చెప్పు కోతగ్గ అనారోగ్యాలుగాని, బాధలు గాని లేవు. అవసరమైతే వంట చేయగలదు. ఇంటిపనులు చూసుకోగలదు. కలుషితం లేని పదార్థాలు, అప్పటి వంట పద్ధతులు తన ఆరోగ్యానికి కారణమని కుంకూ నమ్ముతుంది. "ఇంటి గేదెల పాలు, నెయ్యి త్రాగేవారము. ఇప్పటి వారంతా 'వనస్పతి' ఎక్కువ వాడుతున్నారు. ప్రతి చిన్న దానికి డాక్టరు, మందులు అని పరుగులు పెడుతున్నారు' అంటుంది. పెద్దలు చెప్పే తిండి, పద్ధతులుగాని గృహ వైద్యాలు గాని ఇప్పటి వారికి నచ్చటం లేదు అన్నది కుంకూ ఫిర్యాదు.

తాజాగా వున్న పోషక విలువలు గల ఆహారం ఆరోగ్యకరం అని నమ్మే కుంకూ తన ఇంటిముందు స్థలంలో కూరగాయ మొక్కలు పెంచుతుంది. 'సాధ్యమైనంత వరకు ఇంట్లో పండే కాయగూరలనే వండుకుంటాము' అంటుంది. ఇంటి ముందున్న పెద్ద వేపచెట్టు, దానిముందు ఎర్రటి పూలతో కళకళలాడే మందార చెట్టు గుబురు ఆమె జీవితానికి సాక్షులుగా వున్నట్టు వుంటా యి. 50 సంవత్సరాలు అలుపెరుగ కుండా పనిచేసి అలసిన కుంకూ ప్రస్తుతం మనుమలతో ఆడుకుంటూ అప్పుడప్పుడు టి.వి. చూస్తూ విశ్రాంతిగా కాలం గడుపుతోంది. టి.వి.లో వచ్చే 'మహా భారతం' ఆమెకు ఇష్టమైన కార్యక్రమం. అప్పుడప్పుడు సినిమాలు కూడా చూస్తుంది. కథలు చెప్పటం రాకపోయినా, మంచి చిన్న పాటలతో క్రొత్త క్రొత్త పదాలను పిల్లలకి నేర్పటంలో నేర్పరి కుంకూ. ఆమె చెప్పే కబుర్లకోసం, పాటలకోసం పిల్లలంతా ఆమెచుట్టూ చేరతారు.

ధైర్యం, సహనం, పట్టుదల వుంటే ఎన్ని కష్టాలయినా ఎదురీదగలరు అన్నదానికి 'కుంకుబెన్'ను ఉత్తమ ఉదాహ రణగాచెప్ప వచ్చు.



శోధయాత్ర

నిజామాబాద్ జిల్లాలో మినీశోధ్ యాత్ర

# అద్భుత అనుభవాలు



**– జె. కిషన్ పవార్,** సంగారెడ్డి

ఏప్రిల్ 29, 2007. ఆరోజు నిజామాబాద్‌లో మినీ శోధ్ యాత్ర నిర్వహించుట కు శ్రీ పి. గణేశం గారు నిర్ణయించారు. ఆరోజు వెళ్ళవలసిన ప్రాంతాలు, కలవ వలసిన ఇన్నోవేటర్ల జాబితా, ఆయా ఇన్నోవేటర్లకు సమాచారమందించి వారిని సమాయత్తపరచడం, టాటా సుమో వాహనాన్ని సిద్ధం చేయడం, ఔత్సాహిక ఇన్నోవేటర్లయిన ఇంజనీరింగ్ విద్యార్థులను కూడా వాలంటీర్లుగా సన్నద్ధ పర్చడం ఇత్యాది పనులన్నింటినీ స్థానిక ఇన్నోవేటర్ నరసింహాచారి గారు చక్కని ప్రణాళికతో, చకచకా ఏర్పాటు చేసేశారు.



శ్రీ పి. గణేశం గారికి బోరుజాక్ పనిచేయు విధానాన్ని వివరిస్తున్న ఇన్నోవేటర్ శ్రీ రమణారెడ్డి



నిజామాబాద్ మాణిక్ భండార్ యందు వైద్యం చేయు మూలికి వైద్యుడు తన అనుచర బృందంతో...

ఆరోజు ఉదయం నిజామాబాద్ బస్టాండ్‌లో సికింద్రాబాద్ నుండి వచ్చిన శ్రీ పి. గణేశం గారిని నరసింహాచారి బృందం రిసీవ్ చేసుకున్నారు. అక్కడి నుండి నరసింహాచారి గారి ఇంటికి పయనమయ్యాం. అక్కడ కొద్ది గారి సతీమణి శ్రీమతి శ్వేత గారు అందించిన కమ్మని ఇడ్లీలతో టిఫిన్ ముగించాం. ఇదే సమయంలో శ్రీ పి. గణేశం గారు అప్పటికే అక్కడకు వచ్చి ఉన్న ఇంజనీరింగ్ విద్యార్థులు శ్రీనివాస్, శ్రీకాంత్, గోపి, గోపినాథ్, సౌమ్య, స్వాతి, స్వప్న, ఫిరదౌస్ లకు ఎన్ఐఎఫ్ – హనీబీ నెట్‌వర్క్ గురించి ఎన్నో విషయాలు చెప్పి వారి సందేహాలను తీర్చినారు.

అనంతరం లఘు శోధ్ యాత్ర కార్యోన్ముఖులమై ప్రయాణం ప్రారంభించాము. తొలుత ఉమ్లానాయక్ తండాలో స్థానిక మౌలికా వైద్యుడు మోహన్ ఇంటికి వెళ్ళడం జరిగింది. వారి పాకలోకి చొరవగా వెళ్ళి గణేశం గారు వారిని ఆత్మీయంగా పలకరించారు. ఇన్నోవేటర్ మోహన్‌ను ఇంటర్‌వ్యూ చేయడానికి అక్కడ ఇద్దరు వాలంటీర్లను ఉంచేసి మిగిలినవారం కల్పోల్ గ్రామం వైపు ప్రయాణం కొనసాగించాము. కల్పోల్‌లో మూలికా వైద్యం చేసే గంగరాజం, నారాయణ, గంగారెడ్డి సోదరులను కలుసుకున్నాము. వారు తాము చేసే వైద్యం గురించి, తమ జీవితానుభవాలను గురించి వివరించారు. అనంతరము అక్కడే మరో మూలికా వైద్యుడు పోశెట్టితో సంభాషించడం జరిగింది. పోశెట్టి మాట్లాడుతూ తాను పసిరికలు, తెల్లబట్ట, మధుమేహం, దెబ్బలు మొదలగు వాటికి వైద్యం చేస్తానని తెలియజేశాడు. మేకల గంగాధర్ అనే



నిజామాబాద్ మున్సిపల్ ఆఫీసులో మినీ శోధ్ యాత్రలో పాల్గొన్న హనీబీఏపి వలంటీర్స్‌తో శ్రీ పి. గణేశం

యువకుడు ఉత్సాహంగా నాకు కూడా ఒక చెట్టు గురించి తెలుసునని, 'నెమలినార' అనే చెట్టుయొక్క ఉపయోగాలను తెలియజేశాడు.

అక్కడినుండి చిన్నాపూర్ అనే గ్రామం వెళ్ళాము. అక్కడ 'కొత్తోళ్ళ చిన్న సాయన్న' అనే వ్యక్తిని కలుసుకున్నాము. మూలికా వైద్యంలో ఎంతో అనుభవజ్ఞుడు సాయన్న. 75 సం.ల వయస్సులోనూ ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు. తన గతానుభవాలను నెమరు వేసుకుంటూ తాను యువకుడిగా ఉన్నప్పుడే ఒక పెద్ద మనిషి కొన్ని చెట్ల మందులను గూర్చి తెలిపినాడనీ అప్పటినుండి తాను వైద్యం చేస్తున్నట్లు తెలిపినాడు. నిజామాబాద్ మండలం, గూపన్‌పల్లి గ్రామానికి చెందిన ఒక కుష్టు వ్యాధి గ్రస్తుడిని భార్యా పిల్లలు సైతం దూరం చేయగా తాను అతడికి ఇంట్లోనే ఆశ్రయం కల్పించి వైద్యం చేసి రోగాన్ని పూర్తిగా తగ్గించినట్లు తెలిపాడు. గ్రామంలో గిట్టనివాళ్ళు కొంతమంది తనను మంత్రగాడని ముద్రవేసి బాధలు పెట్టినట్లు తెలిపినాడు. సమాజం తనను ఇంతకాలం గుర్తించక చిన్నచూపు చూసిందన్న బాధ ఆయన కళ్ళల్లో ప్రతిబింభించింది. గణేశం గారి ఆత్మీయ పలకరింపుతో ఆ ముఖంలో సంతోషం వెల్లి విరిసింది. అక్కడి నుండి తిరిగి ప్రయాణమారంభించాం.



ఇంజనీరింగ్ విద్యార్థులకు సూచనలు అందజేస్తున్న హనీబీఏపి కో-ఆర్డినేటర్ శ్రీ పి. గణేశం.

నిజామాబాద్ లో బోరుజాక్ సృష్టికర్త శ్రీ వెంకట రమణారెడ్డి గారిని వారి వర్క్‌షాప్ లో కలిశాము. ఆయన సాదరంగా ఆహ్వానించారు. బోరు జాక్ తయారు చేయడానికి తను చేసిన కృషి గురించి తెలిపి, తన పరికరాన్ని వివిధ ప్రదర్శనలలో పరిశీలించి ప్రశంసించిన ప్రముఖుల ఫొటోలను చూపించారు. అలాగే బోరుజాక్ యొక్క 'మినీ నమూనా' ను ప్రదర్శించారు. అనంతరం వారివద్దనుండి వీడ్కోలు తీసుకుని మాణిక్ భండార్‌లో ప్రసిద్ధి పొందిన ఒక మూలికా వైద్యుడిని కలుసుకున్నాము. ఆయన మాట్లాడుతూ ఒక గురు మహ రాజ్ చూపించిన చెట్ల ఆధారంగా తాను వైద్యం చేస్తున్నట్లు తెలిపాడు. మాకు 'గోసంగి' సంఘం ఉంది. పశువుల రోగాలకు కూడా మందులు ఇస్తాను. ఆదివారం, గురువారం నిజా మాబాద్‌లో ఇస్తాను. రోజుకు సుమారు 4, 5 వందల మంది వస్తారు అని చెప్పాడు. తన స్వంత ఊరు 'వడ్లాడ పల్లె' అనీ, తన బృందం సహాయంతో వైద్యంతో బాటు కథ కూడా చెప్తాము అని తెలిపాడు.



తన ప్రయోగం గురించి శ్రీ పి. గణేశం గారికి వివరిస్తున్న నిజామాబాద్ ఇన్నోవేటర్ / స్కౌట్ శ్రీ నరసింహాచారి

అక్కడి నుండి మళ్ళీ తిరుగు ప్రయాణం. అప్పటికే సాయంత్రం 4 గంటలు దాటిపోతోంది. ఆత్మారాముడు ఆవురావురని అంటుండటంతో ఓ హోటల్లో దూరిపోయాం . జఠరాగ్ని కాస్త చల్లబడ్డాక అక్కడినుండి నిజామాబాద్ మునిసిపాలిటీ ఆఫీసువైపు సాగిపోయాము. చౌక్, స్టార్టర్ అవసరం లేకుండానే కాలిపోయిన ట్యూబ్‌లైట్‌లను వెలిగించే నరసింహాచారి సృజనను ప్రోత్సహించిన నిజామాబాద్ మున్సిపల్ ఛైర్మన్ శ్రీ డి. సంజయ్ గారు ఈ విధానాన్ని మున్సిపాలిటీ ఆచరించి లక్షల రూపాయలు ఆదా చేయగలిగారు. ఇదే మున్సిపాలిటీ ఆఫీసులో నరసింహా చారి గారు తన మరో ప్రాజెక్టు 'ఆంటీ థెఫ్ట్ అలారమ్ సిస్టమ్' నమూనాను బ్రిగేడియర్ శ్రీ పి. గణేశం గారి ముందు ప్రదర్శించారు.



చిన్నాపూర్ గ్రామం మూలికావైద్యుడు శ్రీ కొత్తోళ్ళ చిన్న సాయన్నతో శ్రీ పి. గణేశం.

ఇంజనీరింగ్ విద్యార్థులు సౌమ్య, స్వాతి, స్వప్న, ఫిరదౌస్, శ్రీకాంత్ తమ 'రిమోట్ ఆపరేటెడ్ రోబోట్' నమూనాను ప్రదర్శించారు. వీటిని చూసిన గణేశంగారు సంతృప్తిని వ్యక్తం చేస్తూ వారికి కొన్ని సూచనలు ఇచ్చారు. అనంతరం ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరోజు తమయొక్క శోధ యాత్ర అనుభవాలు వివరిస్తూ ఇది ఒక మరపురాని అనుభూతి అని ఈరోజు ఎంతో ఉత్సాహంగా గడిచిపోయిందనీ, ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నామని తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ హనీబీఏపి చీఫ్ కో–ఆర్డినేటర్ శ్రీ పి. గణేశం గారికి ఉత్తరాలు అందజేశారు. శోధ యాత్ర విజయవంతం అయ్యిందనడానికి ఇంతకన్నా ఋజువు ఇంకేం కావాలి?

బ్రిగేడియర్ గణేశం గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నాతోపాటు నరసింహాచారి, స్వాతి, సౌమ్య, స్రవంతి, గణేష్, గోపిలు పాల్గొన్నారు.

అప్పటికే కాలాతీతమైనందున ఇన్నోవేటర్లు, వాలంటీర్లు అందరికీ ఆదర పూర్వకంగా వీడ్కోలు పలుకుతూ గణేశం గారు హైదరాబాద్ బస్ ఎక్కేశారు. మధుర జ్ఞాపకాల మూటలతో వారి వెనకే నేనూ బస్ ఎక్కేశాను. ●

# మూలికా వైద్యులు

## ఎముకలు విరిగితే

మొద్దు జిమ్మెడ (ముండ్ల) చెట్టు పాలు (మానును కొడితే పాలు వస్తాయి) ఎముకలు విరిగిన చోట చుట్టూ రాసి గట్టిగా కట్టు కట్టాలి. వారం రోజులలో విరిగిన ఎముక అతుక్కుపోతుంది.



గంగారాజం, కల్పోల్ గ్రా.



పోశెట్టి, కల్పోల్ గ్రా.



సాలె దుర్గయ్య, పోచారం గ్రా.



నారాయణ, కల్పోల్ గ్రా.



మోహన్, ఉమ్లానాయక్ తండా




ఉమ్లానాయక్ తండా కు చెందిన గిరిజన వైద్యుడు మోహన్ కుటుంబ సభ్యులు



మూలికా వైద్యుడు మాణిక్ భండార్ గారితో శ్రీ పి. గణేశం

## శరీరంలో నొప్పులు, కీళ్ళ నొప్పులకు

నెమలినార ఆకులకు కొంచెం నూనె పూసి కాస్త వెచ్చజేసి నొప్పి ఉన్నచోట పెట్టి కట్టు కట్టాలి. ఈ విధంగా చేస్తే శరీరంలో నొప్పులు, కీళ్ళ నొప్పులు తొందరగా తగ్గిపోతాయి. అయితే నొప్పి లేనిచోట మాత్రం ఇవి కట్టరాదు. అలా చేసినచో శరీరం పొక్కుతుంది.



మేకల గంగాధర్, కల్పోల్, నిజామాబాద్ జిల్లా.

## ఇరవయ్యవ 'శోధ్‌యాత్ర'

మారుమూల గ్రామాల్లోని సృజనాత్మక సమ్మూహాల నుండి జ్ఞానార్జనకై పాదయాత్ర (శోధయాత్ర) డిసెంబర్ 2007 జార్ఖండ్ రాష్ట్రంలో జరుగనుంది.

పేరు నమోదుకై : sodhyatra@sristi.org

వివరాలకు : nifindia.org, sristi.org




## ఇతర రాష్ట్రాల పల్లె కబుర్లు

సేకరణ :
**"ఇని కర్షకన్ సంసారిక్కట్టె"**
**మళయాళ** భాషా పత్రిక నుండి
**వర్మ (స్టాన్)**

## అధికోత్పత్తి మిరియాల మొక్క

కేరళలోని 'కాడుకమ్మక్కల్' కు చెందిన అబ్రహాం మాథ్యూ అధిక దిగుబడినిచ్చే కొత్తరకం మిరియాల మొక్కను ఉత్పత్తిచేసాడు. 'ఆంపియిరర్' అను మిరియాల జాతి మొక్కను స్త్రీలింగ మొక్కగాను, అంతగా గుర్తింపులేని స్థానిక



మిరియాల మొక్కను పురుష లింగ మొక్కగాను ఉపయోగించి పరపరాగ సంపర్కం జరిపి ఈ కొత్త రకాన్ని ఉత్పత్తిచేశాడు. ఈ హైబ్రిడ్ మొక్క శాఖీయ పెరుగుదలలో ఫలోత్పత్తి ఉత్తమ మైనదిగా రూపొందింది. ఈ రకానికి అబ్రహాం 'కాడుకుమక్కల్' అని పేరు పెట్టాడు. ఈ కొత్తరకం మిరియాలజాతి మొక్క ఆకు తెగుళ్ళను, వేరు తెగుళ్ళను నిరోధిస్తుంది. మామూలు మిరియాల మొక్కలో ఐదు వరుసలు గల స్పైక్ ఏర్పడితే ఈ కొత్తరకంలో ఏడు వరుసలు గల స్పైక్ ఏర్పడుతుంది. అంతేగాక స్పైక్ పొడవు కూడా 13 సెం.మీ. ఉంటుంది. ఇదే కొత్తజాతి ప్రత్యేకత. అధికోత్పత్తి, మీడియం సైజుగల ఫలాలు, వ్యాపారంలో ప్రాధాన్యత నిచ్చే అతి నల్లని రంగు గల ఫలాలు ఈ జాతి యొక్క యితర లాభాలు. నాలుగు సంవత్సరాల మొక్క దాదాపు మూడున్నర కిలోల ఎండిన మిరియాలను ఉత్పత్తి చేస్తుంది. అంతేగాక మామూలు రకాల మిరియాలు ఒక లీటరు పాత్రలో 550 గ్రా. తూగితే ఈ కొత్తరకం మిరియాలు ఒక లీటరు పాత్రలో 640 గ్రా. తూగుతాయి.

రాష్ట్ర సుగంధ ద్రవ్యాల బోర్డు ఈ కొత్తరకం మొక్కను జాతీయ బోర్డుకు సిఫారసు చేసింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పైస్ రిసెర్చ్‌కి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం ఈ కొత్త ఇన్నోవేషన్‌కు యోగ్యతా పత్రాన్ని అందజేసింది.

## కదిలే కుట్టు మిషన్

శ్రీ అడుముగం, శ్రీ శివా బట్టలు కుట్టేవారు. వీరు తమ కుట్టుమిషన్‌ను ఇంటింటికి తీసుకెళ్ళి తమ వృత్తి సాగిస్తారు. కాని తమ మిషన్‌ను అది కాలి మిషనే కావచ్చు, చేతి మిషనే కావచ్చు, గడప గడపకు తీసుకు పోవడం చాలా కష్టమయ్యేది.




ఈ సమస్యను అధిగమించడానికి వారు ఒక ఉపాయం ఆలోచించి, వారు తమ కుట్టు మిషన్‌ను ఒక సైకిల్‌కు అమర్చుకున్నారు. సైకిల్‌లో త్రిభుజాకారంలో వున్న భాగానికి ఒక యినుప ప్లేటు అమర్చుకుని కుట్టు మిషన్‌ను ఈ ప్లేటుపై అనుకూల పద్ధతిలో అది వుంచారు. సైకిల్‌కు ఒక మడత సీటు కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై కూర్చుండి మిషన్ నడపవచ్చు.

ఒక కొత్త సైకిల్ కొని కొత్త మిషన్ అమర్చుకోవాలంటే దాదాపు పదివేల రూపాయలు ఖర్చవుతుంది. తమిళనాడులో సునామి వచ్చినప్పుడు అవసరమైన చోట్లకు వెళ్ళి బట్టలు కుట్టడానికి చాలా ఉపయోగపడింది.

## హ్యాపీ ఆవు! హ్యాపీ పాలు!

పాలు పితికేటప్పుడు ఆవులుగాని, గేదెలుగాని, తోక ఆడిస్తూ వుంటాయి. దీనివల్ల పాలు పితికే వాళ్ళకు తోక తాకుతూ అసౌకర్యంగా వుంటుంది. ప్రస్తుతం తోక వెంట్రుకలు కత్తిరించో లేక తోకను కట్టివేసో ఈ అసౌకర్యాన్ని దూరం చేసుకుం టుంటారు. ఈ పద్ధతివల్ల పశువు లకు బాధ కలుగు తుంది.



ఆ విధంగా కాక పాలు పితికే వారికి, పశువుకు యిరువురికి సౌక ర్యంగా వుండడా నికి కేరళ రాష్ట్రంలోని సైమన్ జార్జి అనే అతను ఒక పద్ధతి కనుగొన్నాడు.

పటములో చూపిన విధంగా పాలు పితికే వారికి, పశువు తోకకు మధ్య 15 – 30 ఇంచుల పరిమాణం గల ఒక ఫలకాన్ని వేలాడదీయాలి. మధ్యలో వుండే ఈ ఫలకం వల్ల పాలు పితికే వారికి పశువు తోక తాకకుండా వుంటుంది. పశువుకు తోకను విధిగా ఆడించుకోవడానికి అడ్డంకి వుండదు. ఈ ఫలకాన్ని అవసరమైన రీతిలో అమర్చుకోవచ్చు. ఆవుకు ఎడమ వైపు భూమికి 15 అంగుళములో ఎత్తులో అమర్చుకోవాలి.

## వేలాడే బ్యాగుల్లో సేంద్రియ ఎరువు

కేరళకు చెందిన పి.పి. సనాల్‌కుమార్ సేంద్రియ ఎరువు (వెర్మి కంపోస్టు) తయారు

చేయడానికి ఒక అసాధారణ పద్ధతి కనుగొన్నాడు. బట్టలు ఆరవేసుకునే దండెం లాంటి తాడుకు పాలిథీన్ బ్యాగులు వేలాడదీసి కంపోస్టును తయారు చేస్తాడు. ఈపద్ధతి వలన ఎలుకలు, చీమలు, చదల బెడద వుండదు. ఈ పద్ధతిలో గోతులు ఏర్పాటు చేసే అవసరం ఉండదు.

ఒక తాడుగాని, ట్వైన్ గాని భూమికి మీటరున్నర ఎత్తులో రెండు చెట్ల మధ్య వేలాడదీయాలి. తాడుకు ఇరువైపుల కొంచెం గ్రీసు రాసి దానిపై క్రిమి నాశక మందును చల్లాలి. దీనివల్ల చదల వల్లగాని ఇతర క్రిముల వల్లగాని



తాడు చెడకుండా వుంటుంది. రంధ్రాలు గల ప్లాస్టిక్ బ్యాగులను తీసుకుని వాటితో అధిక మొత్తంలో ఆవుపేడ నింపి, ప్రతి బ్యాగులో 100 నుండి 200 పురుగులు వేసి వాటిని సమాన దూరంలో తాడుకు వేలాడదీయాలి. 5 రోజుల తర్వాత వాటిలో కొంత నీళ్ళు చల్లాలి. వీటని దాదాపు 45 రోజుల వరకు అలాగే ఉండనిస్తే వెర్మి కంపోస్టు తయారవుతుంది. బ్యాగులు ఉన్న రంధ్రాల గుండా గాలి లభ్యమౌతుంది కనుక వాటిలోని పురుగులు ప్రత్యుత్పత్తి జరుపడానికి అనుకూలం గా వుంటుంది.


గుంటల పద్ధతిలో వుండే అధిక ఉష్ణోగ్రత ఈ పద్ధతిలో వుండదు కనుక పురుగులు చావకుండా వుంటాయి. ఈ పద్ధతిలో వెర్మిన్ వాష్ సేకరణ కూడా సులువే కనుక నూతన పద్ధతి అన్ని విధాల లాభదాయకం. అంతేగాక మామూలుగా అనుసరించే గుంటల పద్ధతిలో చీమలను అరికట్టడానికి గుంట చుట్టూ చిన్న కాల్వలు త్రవ్వి వీటిలో నీటిని నిలవ చేస్తారు. ఈ పిల్ల కాల్వలలోని నీరు దోమల నిలయంగా మారుతుంది. అయితే ఈ కొత్త పద్ధతి వల్ల ఈ ప్రమాదానికి అవకాశముండదు.

సేకరణ : **నామ్ వలి వెలన్మయి**

**తమిళ** భాషా పత్రిక నుండి

## విరిగిన పశువు కొమ్ము కు సులభ వైద్యం

పశువు కొమ్ము విరిగినచో బాగు పరచడానికి సాంప్రదాయకంగా వాడుకలో వుండి, మంచి ఫలితాలనిచ్చే పద్ధతిని వాడ వచ్చునని తమిళనాడుకు చెందిన నాచిముత్తు అనే అతను సలహా యిస్తున్నాడు.



పిడికెడు కలబందను తాటి ఆకులతో కలిపి ఉడికించి, ఈ మిశ్రమానికి రాగుల పిండి కలిపి ముద్దగా తయారు చేయవలెను. ఈ ముద్దను శుభ్రమైన గుడ్డలో పెట్టి కొమ్ము విరిగిన చోట కట్టవలెను. దీనివల్ల విరిగిన కొమ్ము అతుకుతుంది. కొమ్ము అతుక్కోగానే మందు కట్టిన గుడ్డ దానంతట అదే రాలిపోతుంది.

## పశువుల కామెర్ల వ్యాధికి మందు

పశువులకు సరైన ఆహారం దొరకనప్పుడు లేదా అవసరమైనంత నీరు త్రాగనప్పుడు, వాటి శరీరం సూక్ష్మజీవుల నిలయంగా మారుతుంది. ఆ కారణంగా పశువులు చిక్కిపోయి నోటినుండి ఒకరకమైన నురగ బయటకు వస్తుంది. కొరలో కార్పస్ ఎపిజియస్ మరియు అరిస్టో లొకియా బ్రాస్టియో లేటాలను పసుపుతో కలిపి నూరి ముద్దగా చేసి, వరుసగా మూడు రోజులు పరిగడుపున పశువులకు తినిపిస్తే వ్యాధి నయమవుతుంది.

## లిల్లీపుట్ నీటిపంపు

కేరళ రాష్ట్రానికి చెందిన వి. మధుసూధనన్ ఆరవ తరగతి వరకు చదువుకున్నాడు. ఇతను తనకు అందుబాటులో వున్న చిన్న చిన్న విడిభాగాలను ఉపయోగించి నీటిలోపల మునిగి వుండి పనిచేసే నీటిపంపును తయారు చేశాడు. 3 సెంమీ. – 2.5 సెం.మీ. కొలతలుగల ఈ చిన్న పంపు 45 గ్రా. బరువు మాత్రమే వుంటుంది. దీనికి అమర్చిన 3 మి.మీ. వ్యాసార్థం గల పంపు నీటిని రెండున్నర అడుగుల వరకు లాగ గలుగుతుంది. దీనికి 12 మి.మీ. వ్యాసార్థం గల రాగి రేకు ఇంపెలర్ కలిగి వుంటుంది. ఈ పంపు 3 వోల్టుల నుండి 12 వోల్టుల శక్తిగల కరెంటు సహాయంతో నీటిని నిమిషానికి 200 నుండి 800 అడుగుల దూరం వరకు పంపు చేసే శక్తి కలిగి వుంటుంది. ఈ పంపు నిర్మాణంలో మధుసూధన్ గారు వాక్‌మన్ లలోని ఆడియో సిస్టం కొరకు వాడే మోటార్‌ను ఉపయోగించాడు.

కేరళ లోని జిల్లా వాటర్ అథారిటీ ఈ పంపును గంటసేపు పరీక్షించారు. అక్వేరియమ్‌లలోను, రసాయన క్రియల్లోను ద్రవాలను వివిధ లెవల్స్‌కు పంపు చేయడానికి ఈ 'లిల్లిపుట్ పంపు' సమర్థవంతంగా ఉపయోగ పడుతుంది.

సేకరణ : **లోకసర్వని**

**గుజరాతి** భాషా పత్రిక నుండి

## పురుగు పట్టకుండా గింజల నిలువ


నిలువ చేసిన గింజలను కాపాడ టానికి రైతులు అనేక పద్ధతులను పాటిస్తుంటారు. రసాయనాలతో తయారైన పురగు మందులను వాడక సాంప్రదాయ పద్ధతులను వాడుతుం టారు. మిరప పొడి చల్లి, ఉప్పు గండ్లు వేసి, వేపాకులు వేసి, గోధుమ పొట్టు చల్లి, నిలువ చేసిన గింజలు పురుగుల బారిన పడకుండా కాపాడుకుం టుంటారు. ఇవిగాక కొంతమంది తమవైన పద్ధతులు వాడుతూ నిలువ గింజలను కాపాడు కుంటుంటారు.

ఎల్లప్పుడు కరువుతో వుండే గుజరాత్ రాష్ట్రంలోని సబర్ కాంత్ జిల్లాలోని బమ్నా

గ్రామానికి చెందిన ఆర్టిబెన్ మిఠాభాయ్ వంకర్ అనే మహిళ నిలువ చేసిన గింజలను ఒక రకమైన మోదుగు ఆకులను ఉపయోగించి కాపాడుకుంటుంది.

తేమలేని ఒక గుంటను తయారు చేసుకొని అందులో 3, 4 వరుసల మోదుగు ఆకులు పరచి దానిపై గింజలు నింపి, మళ్ళీ 3, 4 వరుసల ఆకులు పరచి మళ్ళీ గింజలు నింపి చివరి వరకు పోయి మళ్ళీ మోదుగు ఆకులను కప్పి గుంటను మూసివేయాలి.

ఈ సాంప్రదాయ పద్ధతిని చాలా



సంవత్సరాల నుండి వాడుతున్నట్టు, ఈ విధంగా నిలువ చేసిన గింజలకు పురుగు పట్టిన దాఖలాలు లేవని ఆర్టిబెన్ అంటారు.

## తెగుళ్ళ నివారణ ఇంకా సులభం


గుజరాత్ రాష్ట్రానికి చెందిన మహేంద్రభాయ్ పటేల్ ప్రతిరోజు సర్వ సాధారణంగా కనిపించే మొక్కలను తెగుళ్ళ నివారణకు ఉపయోగిస్తాడు. మన చుట్టూ ఉన్న అనేక మొక్కలకు క్రిమి నాశక శక్తి ఉన్నట్టు మనకు తెలుసు. ఈ విజ్ఞానాన్ని అవసరము న్నచోట వాడుకోవడం, మహేందర్ భాయ్ ప్రత్యేకత.

పేడ పురుగులు గాని, చెదలు గాని నివారించడానికి ఈ విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నా నంటాడు.

సీతాఫల మొక్క ఆకులు 500 గ్రా. కరంజి ఆకులు 250 గ్రా. జిల్లేడు ఆకులు 250 గ్రా., 10 లీటర్ల ఆవు మూత్రంలో కలిపి, గాలి చొరని పాత్రలో 15 రోజుల పాటు నిలువ చేసి పులియనియ్యాలి. ఆ తర్వాత ఒక గుడ్డతో ఆ ద్రవాన్ని వడగట్టాలి. వడచిన ద్రవాన్ని 250 మి.లీ. 15 లీటర్ల నీటిలో కలిపి చెదలు మొదలగు క్రిముల నివారణకు వాడవచ్చు.

చెదల నివారణకు పైన చేసుకొన్న ద్రవము 5 లీటర్లు తీసుకొని డ్రిప్ పద్ధతిలో ఒక్కొక్క చుక్కను పొలానికి పారించే నీటితో వేస్తూ పోవాలి. పేడ పురుగులను నియంత్రించడానికి పైన చెప్పిన ద్రవాన్ని వారానికొకసారి చొప్పున రెండు వారాల వరకు పిచికారి చేస్తే అనుకున్న ఫలితాలు రావచ్చు.

చెంపకం, తులసి, కృష్ణ తులసి, సీతాఫలం, జిల్లేడు, కరివేపాకు, ఆముదం లాంటి మొక్కలను పంట పొలాల గట్లు లేక చెర్ల



గట్టుపై పెంచుకుంటే ఆ మొక్కల కొరకు వచ్చే పక్షులు మొదలగునవి ప్రధాన పంటను ఆశించే క్రిమి కీటకాలను ఆహారంగా తీసుకొని ప్రధాన పంటను కాపాడుతాయి అదని మహేంద్రభాయ్ పటేల్ నమ్మకం.

## సైకిలు నాగలి కూడా

వ్యవసాయదారులు ఎద్దులకు ప్రత్యామ్నాయంగా మంచి పరికరములతో క్రొత్త పద్ధతుల కొరకు ప్రయోగాలు చేస్తూ వారి ప్రోత్సాహక వ్యవసాయానికి సరియైన యంత్ర పరికరముల కొరకు పరిశోధనలు చేస్తున్నారు.

సౌరాష్ట్రమునందు మొక్కలు నాటే వారు ట్రయల్ అండ్ ఎర్రర్ పద్ధతిలో వారు వాడే పని ముట్లకు క్రొత్త క్రొత్త మార్పులు చేయుచున్నారు.

ఉమ్రేది నివాసి అయిన తాతాభాయ్ గురాడ్ తన భూమిని దున్నుకొనుటకు సైకిలును ఉపయోగించి ఒక పరికన్ని రూపొందించు



కున్నారు. ఇంతకుముందు మహారాష్ట్రకు చెందిన గోపాల్‌భాయ్ భైసే ఇదే పద్ధతిలో కొద్ది మార్పులతో భూమిని దున్నుటకు అరకను రూపొందించారు.

భాతా భాయ్ దీనిని అభివృద్ధి పరచే ఉద్దేశ్యంతో ఒక పాత సైకిలును ఉపయోగించి దానిని వెనుక చక్రం, మరియు క్యారియర్ తీసివేసి దాని స్థానంలో రెండు చక్రములు, వాటి మధ్యలో ఒక పుల్లీ (కుప్పీ) ని అమర్చి దాని వెనుక తక్కువ బరువుగల బ్లేడును అమర్చి దున్నుటకు వీలుగా చేసుకొన్నాడు.

ప్రస్తుతం చిన్న చిన్న మార్పులతో ఒక మోటారు బిగించి దున్నేవానికి పెడలుతో అవసరం లేకుండా చేయవచ్చుననే సంకల్పంతో వున్నారు. అందువల్ల భూమిని దున్నుటకు పనికి వచ్చే సరియైన సామర్థ్యము కలిగిన యంత్రము గురించి అన్వేషణలో వున్నారు.

స్రిష్టి 'సోద్ నంకల్'' అనే సమావేశములో శ్రీ భాతాభాయ్ బరోడ్నదీ వారి ప్రయోగములకు స్పందించి ప్రభుత్వము వారు తగు రీతిలో సత్కరించారు. దీంతో వారి ఉత్సాహం రెట్టింపయింది. పూర్వం వీరి పరిశోధనలను చూసి నవ్విన వారు కూడా ఇప్పుడు వీరిని అనుసరిస్తున్నారు. ●

'హనీబీపపి' అంతరాత్మ
పల్లె సృజన

ప్రోత్సాహం

# కారంచేడు అనుభవాలు

– జి. చంద్రశేఖర్, శ్రీకాళహస్తి

ఒకరోజు బ్రిగేడియర్ గణేశం గారి నుండి ఫోన్ వచ్చింది. కారంచేడు రైతు సదస్సుకు ముఖ్యమంత్రి గారు వస్తున్నారు. మీరంతా హాజరయి మీయొక్క పరిశోధనలు, పరికరాలు ప్రదర్శిస్తే బావుంటుంది అన్నారు. సరే అన్నాను. కారంచేడు ఆంధ్రప్రదేశ్‌లోనే అభివృద్ధి చెందిన గ్రామం. పైగా మా ప్రయోగాలు ముఖ్యమంత్రి గారి ఎదుట ప్రదర్శించవచ్చని సంతోషంగా ఒప్పుకున్నాము.

ఒకరోజు ముందుగా జూన్ 31వ తేదీన కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో నేను, బత్తినాయుడు, మురళి, భాస్కర్ బయలుదేరాము. 12 గంటలకు చీరాల చేరాము. అక్కడే భోజనం ముగించి బస్సులో కారంచేడు బయలుదేరాము. ఊరిలో దిగేసరికి జనంకన్నా పోలీసులే ఎక్కువగా కనిపించారు. ముఖ్యమంత్రిగారి పర్యటన అనేసరికి ఆవూరిని పోలీసులు ఆక్రమించేసారు. మా వస్తువులను అక్కడే వుంచి భాస్కర్‌ను కాపలా వుంచి ముఖ్యమంత్రిగారు ప్రసంగించే వేదిక చూద్దామని వెళ్ళాము. ఏర్పాట్లు ఘనంగా వున్నాయి. ఈలోగా హెలికాప్టరు రెండుసార్లు చక్కర్లు కొట్టింది. తిరిగి వచ్చేసరికి భాస్కర్ కానిస్టేబుల్ మాట్లాడుకుంటున్నారు. భాస్కర్ తెలివిగల వాడయినా ఆయన చెప్పే విషయం సరిగా అర్థం కాదు. "మీదేవూరు" అన్నదానికి చిరికాళ కత్తి అన్నాడు. శ్రీకాకుళం అని అర్థం చేసుకున్నాడు. కానిస్టేబుల్. మేము నవ్వు కున్నాము. శ్రీకాళహస్తి అని చెప్పి అక్కడికి దగ్గరలోని రైతు సదస్సు జరిగే ప్రాంతానికి చేరుకున్నాము.

దూరంనుంచే దుర్గా ప్రసాదు గారు చేయి ఊపుతూ "చూసారా మిమ్మల్ని ఎలా గుర్తు పట్టానో అంటూ స్వాగతం పలికారు. దుర్గాప్రసాదు గారి గురించి కొంచెం చెప్పాలి. ఈ కార్యక్రమానికి కర్త ఆయనే. తమ ఊరికి చుట్టుప్రక్కల ప్రజలకు సహాయపడగలదన్న ఉద్దేశ్యంతో దాదాపు లక్షలు ఖర్చుపెట్టి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఎగ్జిబిషన్ లోపలికి వెళ్ళేసరికి గణేశం గారున్నారు. నవ్వుతూ పలకరించారు. మాకు ఒక స్టాలు చూపించారు. మా వస్తువులక్కడ ఉంచాము. అక్కడ ఎండ విపరీతంగా కాస్తూ వుంది. అంత ఎండలో గణేశం గారు, దుర్గాప్రసాదు గారు తమ పనిలో లీనమైనారు. వ్యవసాయంలో పుట్టి పెరిగిన మాకు ఈ వాతావరణంలోంచి ఎప్పుడు బయట పడదామా అనిపించింది. వారిని చూస్తే వారు తమతమ రంగాలలో ఎంత ఎత్తుకు ఎలా ఎదిగారో అర్థమయింది.

సాయంత్రం ఐదు గంటలకు వూరిని చూద్దామని బయలుదేరాము. సుమారు 500 ఇళ్ళుంటాయి. రెండు పెద్ద కళ్యాణ మండపాలు, 10 దేవాలయాలు ఉన్నట్టున్నాయి. రెండు పెద్ద చారిటి హాస్పిటల్లున్నాయి. ఈ వూరినుంచి సినిమా రంగంలో చాలా మంది ప్రముఖులు ఉన్నారు. ఒకవైపు సిటీని తలదన్నే బిల్డింగులు, మరోవైపు పాత కాలం గుర్తుగా ధాన్యం నిలువ చేసేందుకు ఉపయోగించే గడ్డితో చేసిన గాదులు ఉన్నాయి. ఏదైనా టిఫిన్ తిందామని చిన్న హోటలుకెళ్ళాము. అన్ని హోటళ్ళలో పదార్థాలు సి.ఎమ్. సెక్యూరిటీకే చాల్లేదు. ఆ పరిస్థితి చూసి ఇక రాత్రికి పుద్దు, బెద్దు రెండూ లేవని తీర్మానించుకున్నాము. రాత్రి 10 గం.లకు మంచి భోజనం, కళ్యాణ మండపంలో రూములు ఇప్పించారు దుర్గాప్రసాదుగారు. భోజనం దుర్గాప్రసాద్ గారి ఇంట్లో. ఇల్లు పాతకాలం నాటిది. అయినా ఆధునిక వసుతులన్నీ వున్నాయి. ఇంటి ముందర విశాలమయిన ఆవరణ వుంది. చెట్టుకింద రెండు ఒంగోలు జాతి ఎద్దులున్నాయి. సాదారణంగా బలం, అందం ఒకచోట వుండవు. కానీ ఒంగోలు జాతి ఎద్దులను చూస్తే పశువులు అంత అందంగా వుంటాయా అనిపించింది. మన వేప, మన పసుపు భారతీయులందరూ చెప్పుకున్నట్లుగా మన ఒంగోలు జాతి ఎద్దులు అని చెప్పగలిగేంత గొప్పగా వున్నాయి.

మరుసటి రోజు 8 గంటలకు స్టాలు దగ్గర అన్నీ అమర్చుకున్నాము. మొదటి స్టాలు మాదే. రెండవ స్టాలు నరసింహాచారిది. పనికిరాకుండా పోయిన ట్యూబులైటును స్టార్టరు, చోక్ లేకుండా వెలిగిస్తాడు చారి. ఆయన నిజామాబాద్‌కు చెందినవాడే అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఈయనకు ప్రభుత్వం సహకరిస్తే మనకు ఒక థామస్ అల్వా ఎడిసన్ మరియు విదేశీ మారక ద్రవ్యం విరివిగా లభిస్తాయనుకున్నాను. చారిగారి మార్గదర్శ కత్వంలో ఇంజనీరింగు విద్యార్థులు తయారు చేసిన మోటారును రిమోట్‌తో దూరంనుంచి పనిచేయించడం ఆకట్టుకుంది. ముగ్గురు అమ్మాయిలు. ఈ పోటీలో ఉన్నారు. ఎంతో ఉత్సాహ,గా తమ ఆలోచనలన్నీ అందరితో పంచుకుంటున్నారు.

మూడవ స్టాలు కృష్ణది. ఈయన ప్రకాశం జిల్లావాడు. ఈయన తయారు చేసిన స్ప్రేయర్ రాష్ట్రపతి అవార్డు తెచ్చిపెట్టింది. ఆ తరువాత నిజామాబాద్ జిల్లా శ్రీగణపతి సైకిలు



# Centre Spread

# Centre Spread

చక్రంతో పనిచేసే స్ప్రేయరు అందరినీ ఆకట్టుకుంది. సాధారణ మెకానిక్ దీనిని తయారు చేసాడు. ఆ తరువాత స్టాలు భూమయ్య చారిది. ఆయన చాలా నెమ్మది మనిషి. ఆయనలాగే ఆయన తయారు చేసిన గాలిరిమర నెమ్మదిగా తిరుగుతుంది. తరువాత సుభాన్ తయారు చేసిన భారీ జీప్ స్ప్రేయర్ అందరినీ ఆకట్టుకుంది. మోహన్ పోశెట్టి తయారు చేసిన మైగ్రెయిన్, పెరాలసిస్ మందులున్నాయి. అక్కడే వాటిని కొంతమంది వారిపై ప్రయోగించి చూసుకున్నారు. పులిపిర్లకు శ్రీనివాస రావు తెచ్చిన మందులు ఎక్కువగా కొనుగోలు చేశారు. పులిపిర్లకు వైరస్ కారణం. వైరస్ అల్లోపతి మందులకు లొంగదు.

అన్ని స్టాల్లు అమర్చి ముఖ్యమంత్రిగారి కోసం ఎదురు చూస్తున్నాము. ఈలోగా గణేశం గారు ముఖ్యమంత్రిగారు వచ్చినప్పుడు ఎలా మాట్లాడాలో సూచనలిచ్చారు. 10 గంటలకు వస్తాడనుకున్న ముఖ్యమంత్రి 11-30 గంటలకు హెలికాప్టరులో వచ్చారు. వస్తూనే రైతు సదస్సుకు చేరుకున్నారు. కానీ, వచ్చినంత సేపు పట్టలేదు తిరిగి వెళ్ళేందుకు. 10 ని. కూడా అక్కడ గడపలేదు. ఆ కొద్ది సమయంలోనే దుర్గాప్రసాదు గారు గణేశం గారు ఎన్.ఐ.ఎఫ్. స్టాల్సు గురించి వివరించేందుకు ప్రయత్నించారు. అందరం చాలా నిరాశపడ్డాం. సెక్యూరిటీ ప్రాబ్లం వల్ల త్వరగా వెళ్ళిపోయారని సర్ది చెప్పుకున్నాము.

ముఖ్యమంత్రిగారు వెళ్ళిన వెంటనే ఎగ్జిబిజన్ చూసేందుకు జనం బాగా వచ్చారు. మేము తయారు చేసిన చర్మవ్యాధులకు, నొప్పులకు పనిచేసే మందులు కొనుగోలు చేశారు. అదేవిధంగా మోటారును లో వోల్టేజీలో మరియు బావిలో నీరు అయిపోయిన వెంటనే ఆఫ్ చేసే పరికరాన్ని జనం మెచ్చుకున్నారు. జనం స్పందన చూసిన తరువాత ముఖ్యమంత్రి చూడలేదన్న బాధ పోయింది. జనం పల్చబడ్డ తరువాత గణేశం గారి నుండి పిలుపు వచ్చింది.

## జలుబుకు ఉపశమనం

**200-250 గ్రాముల ఉప్పు, ఆవునెయ్యి కలిపి వేడిచేసి ఒక శుభ్రమైన బట్టమీద పొయ్యాలి. దాన్ని మూటగట్టి, ఛాతీమీద కాపడం పెట్టాలి. వెంటనే జలుబు వల్ల మూసుకున్న ముక్కు రంధ్రాల నాళాలు తెరుకుంటాయి. గాలి తేలిగ్గా పీల్చుకో గల్గుతారు. ఎంతో ఉపశమనం కలుగుతుంది.**

ఎన్.ఐ.ఎఫ్. వారంతా ఒకచోట సమావేశం అయ్యాము. సిఎమ్ పర్యటన కలిగించిన నిరాశ గణేశం గారిలో కనిపించింది. దేశం కోసం ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్న ఆయన వెంటనే తేరుకుని మాకు మజ్జిగ తెప్పించారు. ఎన్.ఐ.ఎఫ్. భవిష్య కార్యక్రమాల గురించి వివరించి కర్తవ్య బోధ చేసిన తీరు మాకు స్ఫూర్తినిచ్చింది.

ఆరోజు సాయంత్రం రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన జంగిరెడ్డి గారి జానపద గీతాల కార్యక్రమం దుర్గా ప్రసాదుగారు పిలిచి ఆయన పక్కనే కూర్చోబెట్టారు. జానపద గీతాలు ఎంత హుషారుగా వున్నాయంటే ఒకటే చప్పట్లు, ఈలలు. తనకు ఈల వేసేది రానందుకు దుర్గాప్రసాదుగారు బాధపడ్డారు. ఆ వెంటనే 'పల్లె కన్నీరు ఒలికిందో కనిపించని కుట్రల' అన్న గీతం అందరి మనసులను కదిలించింది.

మరుసటి రోజు దగ్గర్లోని ఓడరేవు బీచ్‌కు వెళ్ళడానికి గణేశం గారు అనుమతిచ్చారు. అక్కడికి 7 కి.మీ. దూరం వుంటుంది. సముద్రం. సముద్రాన్ని చూస్తూనే వృథా అవుతున్న అల శక్తిని చూసి కృష్ణ గారు చాలా బాధపడ్డారు. అప్పటికప్పుడు అలను ఒడిసి పట్టాలన్నంత ఆతృత చూపించారు. మాకు గ్రూపు లీడరుగా కిషన్ పవార్‌ను నియమించారు. ఆయన టీచరు. కానీ, మా లగేజీని మోయడానికి ఎల్లప్పుడు సిద్ధంగా వుండేవారు. అందువలన మాకందరికి చాలా గౌరవం. నేను, బత్తినాయుడు, మురళి, భాస్కర్ ఆయనను చూసి మనిషంటే అలా వుండాలని అనుకున్నాము. సముద్ర స్నానాలు చేసి అలసిపోయిన తరువాత అక్కడినుండి బయట పడ్డాము. తిరుగు ప్రయాణంలో విపరీతంగా చెమట పోయనారంభించింది. ప్రతి విషయాన్ని వైజ్ఞానికంగా ఆలోచించే నాకు సముద్రం దగ్గర ఈ ఉక్కపోత ఏమిటా అని ఆలోచించాను. సహజంగా సముద్రం దగ్గర గాలిలో తేమ అధికంగా వుంటుంది. తేమగాలి చెమటను పీల్చుకోదు అందువల్లనే మా శరీరాలు తడిసి ముద్దయ్యాయి. ఈ విషయాన్ని ఎన్.ఐ.ఎఫ్. వారందరికి వివరించాను. తిరిగి కారంచేడు చేరుకున్నాము. భోజనం చేస్తూంటే ప్రతి ఒక్కరము కాస్త ఎక్కువ తింటున్నాము. దుర్గా ప్రసాదు గారు అంతబాగా తయారు చేయించారు.

మరుసటి రోజు మరలా ఎగ్జిబిషన్ ప్రారంభం కలెక్టరు గారు సందర్శించారు. దోమలను నివారించే మొక్క గురించి శ్రద్ధగా విన్నారు. ఆ మొక్కలు కావాలని అడిగారు. తరువాత ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర రావు గారు వచ్చారు. ఆయన ఆవూరి వారే. అన్ని స్టాల్సు ఓపిగ్గా తిరిగి పరిశీలించారు. ఈలోగా కేరళకు చెందిన వారు స్టాలు ఏర్పాటు చేసారు. వారికి భాష సమస్య అయింది. మా బత్తినాయుడు దగ్గరుండి వారికి కావలసిన సహాయం చేసాడు.

సాయంత్రం డబ్ల్యు.టి.ఓ. ప్రతినిధి వస్తున్నారని తెలిసింది. ఎదురు చూస్తున్నాము. ఆయన అనుకున్న టైంకు సరిగ్గా వచ్చారు. మా స్టాలు దగ్గర 10 నిమిషాలు గడిపారు. అలాగే అన్ని స్టాల్ల దగ్గర గడిపారు. ఇక్కడి పరికరాలన్ని సరళంగాను, తక్కువ ఖర్చుతోను వున్నాయని వీటిని మెచ్చుకోవడమే గాక వీటికి తగిన మార్కెట్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మనందరిమీద వుందని చెప్పారు. మేము ఇక్కడకు వచ్చినందుకు డబ్ల్యు.టి.ఓ. ప్రతినిధి పూర్తి న్యాయం చేసారనిపించింది.

ఈలోగా గణేశం గారి శ్రీమతి అరుణ గారు కనిపించారు. మీమందు బాగా పనిచేస్తూ వుంది, ఇంకా మందు కావాలి అన్నారు. హైదరాబాద్‌లో మా మందు అరుణగారి ద్వారా ప్రచారం పొందుతున్నందుకు చాలా ఆనంద పడ్డాము. రూములో విశ్రాంతి తీసుకుంటుంటే మేం ఊహించని విధంగా గణేశం గారు, దుర్గా ప్రసాదు గారు మా రూముకు వచ్చారు. కాసేపు కార్యక్రమం ఎలా జరిగింది అన్నదానిపై చర్చించాము. పబ్లిసిటీ ఇచ్చివుంటే ఇంకా బాగా జరిగేదని అందరమూ అనుకున్నాము.

చివరగా రాత్రి భోజనం చేస్తూ వుంటే నేను, మురళి, బత్తినాయుడు మంచినీళ్ళకోసం వెతుకుతున్నాము. ఇది గమనించి బి.టెక్ విద్యార్థి శ్రీను పరుగున వెళ్ళి తీసుకు వచ్చాడు. అతని సహృదయతకు చాలా సంతోషించాము. శ్రీను గణేశం గారి శిష్యుడుమ. గురు శిష్యులను గూర్చి కొంతసేపు చర్చించుకున్నాము. ఏ టైములో ఫోను చేసినా విసుక్కోకుండా వుండే గణేశం గారికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాము.

అందరికీ వీడ్కోలు పలికి అనేక తీపి, చేదు గుర్తులను మోసుకుంటూ బస్సెక్కాము. ఇంతకీ కార్యక్రమం విజయవంతమయిందా? లేదా? నాలో నేను ప్రశ్నించుకున్నాను. అపశృతులు ఎన్ని వున్నా మొదటి ప్రయత్నంగా ఇలాంటి కార్యక్రమాన్ని రైతులకు పరిచయం చేయడంలో దుర్గాప్రసాద్ గారు విజయం సాధించారనడంలో సందేహం లేదు. ఇదే ఆయన చివరి కార్యక్రమం అయితే అపజయం పొందినట్లే అనుకుంటూ శ్రీకాళహస్తికి చేరినాము. ●

ప్రయోగం

## రాజమల్లు ప్రయోగంతో

# ప్రత్తి పంట సస్యరక్షణ

వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం, గొర్లవీడు గ్రామానికి చెందిన రైతు శ్రీ కౌటం రాజమల్లు. వీరు ప్రత్తి పంటకు ఆశించే చీడ పీడల నివారణలో ఒక నూతన ప్రయోగాన్ని చేపట్టి, సత్ఫలితాలు సాధించి, అందరి దృష్టినీ ఆకర్షించారు. తదుపరి ఈ గ్రామానికి చెందిన ఇతర రైతులు కూడా ఇదే మార్గాన్ని అనుసరించడం విశేషం. పల్లె సృజన ప్రతినిధి కిషన్ పవార్‌తో శ్రీ కౌటం రాజమల్లు గారి ఇంటర్వ్యూ విశేషాలు వారి మాటల్లోనే తెలుసుకుందాం.

**ప్ర. నమస్కారం రాజమల్లుగారూ! ప్రత్తి పంటలో మీరు చేపట్టిన నూతన ప్రయోగం గురించి మా పాఠకులకు తెలియజేస్తారా?**

జ. నమస్కారమండీ! తప్పకుండా తెలియజేస్తాను. ప్రత్తి పంటను ఆశించే పురుగులను నియంత్రించడానికి మేము సాధారణంగా వేప కషాయాన్ని వాడేవారము. మా ఊరికి దగ్గర్లో ఉన్న అడవిలో 'విషముష్టి' చెట్లు ఉన్నాయి. ఈ చెట్టు పండ్లు విషపూరితము. అయితే ఈ చెట్లు పండ్లను కూడా క్రిమి సంహారకముగా ఎందుకు వాడకూడదు? అన్న ఆలోచనతో వీటిని వాడడం జరిగింది. ఫలితాలు

**ప్ర. ప్రయోగ విధానం ఎలాగో చెబుతారా?**

జ. అయితే మేము వేప కషాయం 3సార్లు వాడిన తర్వాత 'విషముష్టి' కషాయం వాడి సత్ఫలితాలు పొందాము.

**ప్ర. కాస్త వివరంగా చెబుతారా?**

జ. ప్రత్తి పంటకు పూత సమయం లో 20 రోజుల వ్యవధితో వేప కషాయము 3 సార్లు స్ప్రే చేయాలి. తదుపరి విషముష్టి కషాయం కూడా 20 రోజుల వ్యవధిలో 1 లేదా రెండుసార్లు స్ప్రే చేయాలి. విష ముష్టి కషాయం రెండు మార్లకన్నా ఎక్కువ కొట్టరాదు. ఈ విధానం ద్వారా పచ్చ పురుగు, నార పురుగు, లద్దె పురుగులను నివారించ వచ్చు.



**ప్ర. మీరు ఏయే పంటలకు ఈ విధా నాన్ని అనుసరిం చారు?**



జ. మేము మాత్రం కేవలం ప్రత్తి పంట కు మాత్రమే వాడాము. ఇతర పంటల గురించి తెలియదు.

**ప్ర.వేప కషాయం ఎలా తయారు చేయాలి?**

జ. వేప పండ్లను బాగా నలగగొట్టాలి. రేపు స్ప్రే చేస్తారనగా ఈరోజు సాయంత్రం నీటిలో నానబెట్టి ఉదయం బాగా పిసికి కషాయం తీయాలి. 3 కిలోల పిండి నాన బెట్టగా వచ్చిన కషాయానికి అరకిలో వాషింగ్ పౌడర్ కలిపి కొడితే ఒక ఎకరాకు సరిపోతుంది.

**ప్ర. విషముష్టి పండ్ల కషాయం తయారు గురించి చెప్పండి.**

జ. ఎకరాకు 5 కిలోల విషముష్టి పండ్లను తీసుకోవాలి. వీటిని మెత్తగా దంచి వేడినీళ్ళలో మరగబెట్టి కషాయం తీయాలి. 5 లీటర్ల నీటితో మరిగిస్తే 2 లీటర్ల కషాయం తయారవుతుంది. దీనికి అర కిలో వాషింగ్ పౌడర్ కలిపితే ఎకరాకు సరిపడ ద్రావణం తయారవుతుంది.

**ప్ర. ద్రావణం తయారీ మరియు పిచికారీ (స్ప్రే) సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమైనా ఉన్నాయా?**

జ. విషముష్టి పండ్లు చాలా విషపూరితమయినవి. చిన్న పిల్లలకు, పెంపుడు పశువులకు దూరంగా ఉంచాలి. వీటిని దంచి కషాయం మరగబెట్టేటప్పుడు, స్ప్రే చేసే సమయంలోనూ కంటి అద్దాలు వాడాలి. ముఖానికి గుడ్డ కట్టుకోవాలి.

**ప్ర. మీ గురించి చెప్పండి.**

జ. మాది వ్యవసాయ కుటుంబం. నేను ఏడవ తరగతి వరకు చదివాను. మా అన్నదమ్ములకు వ్యవసాయమే జీవనాధారం. మా గ్రామంలోని ఇతర రైతులు కూడా ఈ విధానాన్ని అవలంభించి లాభం పొందారు. నాకు చాలా సంతోషంగా ఉంది. ●

సృజన

# వాటర్ పాకెట్స్

– **ఉప్పుతేళ్ళ కృష్ణ,** అనంతవరం, ప్రకాశం జిల్లా

సెలయేరులకు చెక్ డాములు కట్టడం వలన ఉపయోగం : భూగర్భ జల మట్టము పెరుగుతుంది. బోర్లు తొందరగా ఒట్టిపోవు పశు పక్ష్యాదులకు త్రాగునీరు అందుబాటు లో వుంటుంది.

ఎక్కువ లోతుగా ప్రవహించుచున్నప్పుడు ప్రవాహపు వాలుకు అడ్డంగా రెగ్యులేట్ చేయుటకు వీలున్న తలుపులు పెట్టి అడ్డుకట్ట వేయవచ్చు. కట్టకు ఎగువన వాగుకు రెండు అంచుల వెంట బలమైన ఎత్తయిన మట్టి (కాంక్రీట్) గోడలు కట్టి – వర్షం రాని సమయంలో నీటిని నిలువ చేసినట్లయితే ఎల్లప్పుడు ఆ వాగు లేక చిన్న నది నీటితో నిండుగా వుంటుంది. సజీవంగా వుంటుంది.




ఇలా ఆ వాగు లేక నది మొత్తం పొడవులో అనేక వందల వాటర్ ప్యాలెట్లు నిర్మించవచ్చు.

రెగ్యులేటర్ తలుపులు ఉండటం చేత వాగుకు, లేక నదికి ప్రవాహమునకు ఏ విధమైన ఆటంకము ఉండదు. అవసరం ఉన్నప్పుడు మాత్రమే తలుపులు మూసి, నీటిని నిలువ వుంచుతాము. అవసరం లేదనుకుంటే తలుపులు తెరిచి నీటిని కిందికి పంపుతాము. ఈ సంవత్సరం ఇప్పటి వరకు (జూన్ + జులై) 3.3 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం లోకి వృధాగా కలిసి పోయింది.

నదులకు ఆనకట్టలు, బ్యారేజిలు కట్టడం వలన ఉపయోగం : కాలువల ద్వారా ప్రవహించిన నీటితో పంటలు బాగుగా పండుతాయి. ప్రాణికోటి (మనుషులకు) కి త్రాగటానికి నీరు లభ్యమవుతుంది. పరిశ్రమల అవసరాలకు నీరు దొరుకు తుంది. వృధాగా సముద్రంలో కలిసే నీటిని సద్వినియోగం చేస్తాం.

వాగులకు – చిన్న నదులకు వాటర్ ప్యాలెట్లు నిర్మించడం వలన ఉపయోగం : ఇది సరికొత్త ఆలోచన. ఒక చిన్న నది లేక వాగు భూ మట్టం క్రింద మీటరుకన్న



సమీక్ష

## ప్రకాశం జిల్లా 'కారంచేడు' గ్రామంలో

# గ్రామీణ ప్రగతి ప్రదర్శన

ఈ సంవత్సరం (2007 జూన్ 1వ తేది నుండి 10వ తేది వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాలో వున్న కారంచేడు గ్రామంలో 10 రోజుల పాటు 'గ్రామీణ ప్రగతి ప్రదర్శన' పేరుతో ఒక ప్రదర్శన నిర్వహించబడినది. ఈనాడు లభ్యమయ్యే విజ్ఞానాన్ని రైతుల గడప వరకు తెచ్చే సదుద్దేశ్యంతో ఈ ప్రదర్శన నిర్వహించబడింది. ప్రభుత్వ శాఖలు స్వచ్ఛంద సంస్థలు, ఎన్.ఐ.ఎఫ్., గ్రామీణాభివృద్ధిలో పాల్గొనే ఇతర ప్రైవేటు సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ ప్రదర్శనకు రైతులు విచ్చేసి, అందులో ప్రదర్శింపబడిన వాటిని చూసి లాభపడాలనేదే ఈ ప్రదర్శన ఉద్దేశ్యం. ఈ ప్రదర్శనకు సర్వత్రా ఆమోదం, అభినందనలు లభించినవి. 'కారంచేడు ఫార్మర్స్ ట్రస్ట్' మరియు 'ఫార్మర్స్ ఫెడరేషన్' కు చెందిన శ్రీ జె. దుర్గాప్రసాద్ గారు ఈ కార్యక్రమానికి ప్రధాన సూత్రధారి. శ్రీ దుర్గాప్రసాద్ గారు కారంచేడు గ్రామంలో జన్మించి, తన జన్మభూమి ఋణం తీర్చుకోవాలన్న పవిత్ర ఆశయంతో తన గ్రామానికి చెందిన, ప్రక్క గ్రామాలకు చెందిన రైతులు లాభపడాలనే సదుద్దేశ్యంతో, దేశంలోనే ప్రప్రథమంగా, ఈ ప్రత్యేక ప్రదర్శన ఈ ఏర్పాటు చేయడంలో సఫలీకృతులైనారు.

ఎన్.ఐ.ఎఫ్. మరియు హనీబీఏపి గురించి అవగాహన కలుగజేయుటకు, రైతులు ప్రతిరోజు ఎదుర్కొనే సమస్యలకు చిన్న చిన్నవైనా ప్రభావం చూపే పరిష్కారాల కొరకు మన రాష్ట్ర రైతులు చేసే ఇన్నోవేషన్లు ప్రజల ముందుంచటమే కక, రాబోయే 6వ క్యాంపేన్ గురించి ప్రజలలో ప్రచారం చేసే ఉద్దేశ్యంతో ఎన్.ఐ.ఎఫ్. ఈ ప్రదర్శనలో పాల్గొనుటకు నిశ్చయించింది.

దాదాపు 10 ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రదర్శన జూన్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ద్వారా ఆవిష్కరించబడింది. దీనిలో ముఖ్యంగా ప్రభుత్వ శాఖలు, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రణాళికలు, పథకాలు, టెక్నాలజీకి సంబంధించిన వాటితోపాటు 28 మంది ఇన్నోవేటర్లు ఈ ప్రదర్శనలో పాల్గొని తమ ప్రదర్శనలను రైతులకు ప్రదర్శించడం జరిగింది. ఈ ఇన్నోవేటర్లలో చాలామంది దక్షిణాది రాష్ట్రాల వారే కావడం గమనార్హం. ఎన్.ఐ.ఎఫ్. స్టాల్ ప్రదర్శనకు ముఖ్యమైన ఆకర్షణగా నిలిచింది. నర్సింహాచారి తయారు చేసిన చోక్, స్టార్టర్ లేని 200 ట్యూబ్ లైట్లను ప్రదర్శనలో వెలిగించడం జరిగింది. ఇన్నోవేటర్లకు ఇదొక గౌరవనీయమైన విషయం. ముఖ్యమంత్రి గారు ఇన్నోవేటర్లతో కొంత సమయాన్ని గడిపారు. ఆ తర్వాత కలెక్టర్, స్థానిక ప్రభుత్వాధికారులు, రాజకీయవేత్తలు, సంఘ సేవకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎన్.ఐ.ఎఫ్. స్టాళ్ళను తిలకించడం జరిగింది.

ఆరోజు దాదాపు వెయ్యి మంది సందర్శకులు ఎన్.ఐ.ఎఫ్. స్టాళ్ళు చూసి తమ ఆసక్తి కనబరిచారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ సిద్దార్థ గారు, ఇన్నోవేటర్లను సంప్రదించి విషయాలు గ్రహించి, ఎన్.ఐ.ఎఫ్. మరియు హనీబీ కార్యక్రమాల్లో చురుకుగా పాలు పంచుకోవాలన్న అభిలాగ తెలియపరిచారు. ఇంతేగాక ప్రకాశం జిల్లాలోని తన క్రింది అధికారులకు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్, యస్.పి. స్థానిక ఎం.ఎల్.ఏ. మొదలగు వారు ఇన్నోవేటర్లతో చాలా సమయం గడపడం, ఇన్నోవేటర్లకు గర్వకారణం, సంతృప్తి కలిగింది.

తెలిసి తెలియని కారణాల వల్ల రెండవ రోజు నుండి ప్రదర్శనలో సందర్శకుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ప్రతి రోజు ఉదయం పూట సెమినార్లు ఏర్పాటు చేయబడినవి. వీటికి జనం అధిక సంఖ్యలో హాజరైనారు. వీరందరికి ఎన్.ఐ.ఎఫ్. గురించి సమాచారం పంచబడింది. ప్రతిరోజు బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి వ్యవసాయ శాస్త్రజ్ఞులు మరియు ప్రభుత్వోద్యోగులు, అనేక విషయాలపై తెలుగులో రైతులకు అర్థమయ్యే రీతిలో ప్రసంగించారు. ఈ సమావేశాలు పరస్పర అవగాహనలతో చాలా అర్థవంతంగా ముగిశాయి. జూన్ 2న భారతదేశం మరియు భూటాన్‌లలో ఎఫ్.ఎ.ఓ. ప్రతినిధి అయిన శ్రీ డేనియల్ గుప్త ఫసన్, బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రజ్ఞులతో కలిసి ప్రదర్శనను సందర్శించారు.

శ్రీ డేనియల్ గారు ఇన్నోవేటర్లతో ముచ్చటించడం, వారిని ప్రోత్సహించడం ఒక అద్భుత దృశ్యంగా తోచింది. వారు ప్రదరిశంపబడినవన్నీ అత్యంత ఆసక్తితో చూస్తూ



*జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శన (కారంచేడు) సందర్భంగా హనీబీఏపి, కేరళ, తమిళనాడు, కర్నాటకకు చెందిన ఇన్నోవేటర్లతో శ్రీ పి. గణేశం, శ్రీమతి అరుణా గణేశం, శ్రీ దుర్గాప్రసాద్ గార్లు*

గంటకు పైగా గడిపారు. నిత్య జీవితంలో తారసిల్లే సమస్యలకు సులువైన, సమర్థవంతమైన సమాధానాలు కనుగొనటంలో, గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రాథమిక స్థాయి ఇన్నోవేటర్లు చేసే కృషిని చూసి ఆశ్చర్యం వేసిందని, పొంగిపోయానని, శ్రీ గుప్తప్పన్, తన ప్రసంగంలో కొనియాడారు. ఇన్నోవేటర్లకు ఇది ఒక అద్భుత క్షణంగా, సంతృప్తికర సమయంగా తోచింది. ఇన్నోవేటర్లు బహూకరించిన మందులను ఇతర బహుమతులను ఆయన సగౌరవంగా స్వీకరించి తనతో తీసికెళ్ళారు.

సందర్శకుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయినందున జూన్ 4వ తేది ప్రదర్శన ముగించుటకు నిశ్చయింపమడినది. అదేరోజు ఇన్నోవేటర్లందరూ తమతమ స్వస్థలాలకు నిష్క్రమించారు.

**ఈ ప్రదర్శన సాధించిన సత్ఫలితాలు :**

◆ దాదాపు 50 మంది ఇన్నోవేటర్లు, వాలంటీర్లు, 4 రోజుల పాటు కలిసి గడిపారు. వీరు తమతమ అనుభవాలను అరమరికలు లేకుండా పంచుకుంటూ, ముచ్చటించుకుంటూ, నవ్వుకుంటూ కాలం గడిపారు దీనివల్ల వారిలో స్నేహ సంబంధాలు, సౌభ్రాతృత్వం వెల్లివిరిసాయి. ఇది అతి ముఖ్యమైన లాభంగా పరిగణించవచ్చు.

◆ ప్రకాశం జిల్లాలోని ప్రభుత్వోద్యోగులకు, ప్రభుత్వ శాఖలకు, స్థానిక నాయకులకు, రైతులకు ఎన్.ఐ.ఎఫ్. కార్యక్రమాల గురించి పూర్తి అవగాహన ఏర్పడింది.

◆ దాదాపు 70 గ్రామాల వారు శ్రీ నర్సింహాచారి తయారు చేసిన ట్యూబ్‌లైట్ల గురించి ఆసక్తి వ్యక్తపరిచారు.

◆ రిమోట్ పరికరంతో పనిచేసే మోటార్లపై దాదాపు 100 మంది ఆసక్తి కనబరచారు.

◆ వృక్ష ఓషధులు (హెర్బల్ మెడిసిన్) అక్కడికక్కడే విక్రయించబడ్డవి.

◆ క్రిమి సంహార మందులు వెదలజల్లడానికి శ్రీ గణపతి తయారు చేసిన ఏకచక్ర 'సైకిల్ నాగలి' రైతులలో, ప్రభుత్వాధికారులలో ఒక పెద్ద ఆకర్షణగా మారింది.

◆ కేరళ రైతులు తెచ్చిన సుగంధ ద్రవ్యాలు ఆ మూడు రోజుల్లో పూర్తిగా విక్రయించబడ్డాయి.

◆ పల్లె సృజన పెద్ద మొత్తంలో పంచి పెట్టడం జరిగింది. ఆ పత్రికకు మంచి ఆదరణ లభించింది. దీనివల్ల భవిష్యత్తులో పెద్ద మొత్తంలో చందాదారులు లభించే అవకాశాలు మెరుగు పడ్డాయి.

◆ ఇలాంటి పెద్ద కార్యక్రమాలు, పల్లె వాతావరణంలో, ఏలాంటి సహకార వ్యవస్థ లేకుండా ఏ విధంగా నిర్వహించవచ్చో వాలంటీర్లు నేర్చుకున్నారు.

◆ 45 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత కలిగిన మండుటెండల పల్లె వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించబడటం ఒక విశేషం.

◆ భారతదేశంలో ఎఫ్.ఎ.ఓ. ప్రధానాధికారి ఈ ప్రదర్శనకు రావడం ఓ ప్రత్యేకత.



*ప్రదర్శనలో శ్రీ పి. గణేశం గారు ఇన్నోవేటర్లను అతిథులకు పరిచయం చేస్తున్న దృశ్యం.*

◆ ప్రదర్శన విశేషాలు, ఇన్నోవేటర్లతో ముఖాముఖి మొదలగు స్థానిక కేబుల్ టి.వి. వారు ప్రత్యక్ష ప్రసారం చేయగా చుట్టూ వున్న 3, 4 జిల్లాల వారు తిలకించడం ఓ ప్రత్యేక విశేషంగా చెప్పుకోవచ్చు.

ఇన్నోవేటర్లు ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొని ఆంధ్రప్రదేశ్‌లోని ఒక కొత్త ప్రదేశంలో తమ విషయ పరిజ్ఞానం పెంచుకోవడం, ఈ ప్రదర్శన యొక్క ప్రత్యక్ష ఫలితంగా భావించ వచ్చు. ఈ ప్రదర్శన ఏర్పాటులో నిర్దేశించబడిన ఆశయం పాక్షికంగా ఫలించడం సంతోషకర విషయం. ●

## 'పేటెంట్' కావాలంటే సంప్రదించండి

మీ జ్ఞానాన్ని, ఆలోచనలను, ప్రక్రియలను, ప్రయోగాలను సొంతం చేసుకోవాలంటే భారత పేటెంట్ చట్టం ప్రకారం పేటెంట్ ఆఫీసుల్లో అప్లికేషను పెట్టుకోవాల్సి వుంటుంది. గ్రామీణ ప్రజలకు ఈ తతంగం తెలీక పేటెంట్ చేయడానికి ముందుకు రారు.

పల్లె సృజన వీరందరికి సహాయం చేయడానికి నడుం కట్టింది. హనీబీఎపి స్వచ్ఛంద సభ్యుడు, ప్రముఖ న్యాయవాది శ్రీ రామశర్మ గారు తెలుగు ఇన్నోవేటర్లకు ఉచితంగా పేటెంటు అప్లయ్ చేయడానికి అంగీకరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాము.

సంప్రదించవలసిన చిరునామా :

**శ్రీ రామశర్మ గారు,**
**హనీబీఎపి, హైదరాబాద్.**
**ఫోన్ : 040-27118555**

**కొత్త స్వరాలు**

<u>మంచుకొండ శ్రీనివాసరావు ప్రయోగం</u>

# పులిపిర్లకు సాంప్రదాయ వైద్యం

నాకు మొదట చేతి వేలికి ఒక పులిపిరి అయింది పల్లెల్లో చాలామంది చెబుతున్నట్లు గుర్రపు వెంట్రుకతో గుంజడం, అగరొత్తులతో కాల్చడం చేశాను. కాని అవి తగ్గకపోగా మళ్ళీ పిలకలుగా వచ్చాయి. అవియే కాక కాలికి చిన్నవి, పెద్దవి ఎక్కువ సంఖ్యలో చూడడానికి అసహ్యంగా మారి కనిపించడం మొదలైంది. డాక్టరును



సంప్రదించగా వాటిని సర్జరీ చేయాలని చెప్పాడు. సర్జరీ అంటే ఖర్చుతో కూడుకున్న పని, పైగా శరీరంపై మచ్చలు పడే అవకాశముందని ఆ ప్రయత్నం మానుకున్నాను.

అది వేసవి కాలం కావడంతో మామిడి కాయలు విరివిగా కాస్తాయి. అప్పుడు నాకు చిన్నప్పటి జ్ఞాపకం ఒకటి గుర్తుకు వచ్చింది. నా చిన్న వయసులో మామిడి కాయ తింటుండగా సొన పెదవులపై అంటి పుండ్లు అయినాయి. అది గుర్తుకు వచ్చి ఈ పులిపిర్లకు ఎన్నో రకాలు వైద్యం చేసి విసిగి పోయిన నేను ఈ ప్రయోగం మొదలు పెట్టాను. పులిపిర్లను బ్లేడుతో గీకి, (చిన్నగా రక్తం కారేటట్లుగా) మామిడి టెంక సొనను అంటించాను. అయితే నా ఆలోచన ప్రకారం అది అంటించడం వల్ల పులిపిర్ల దగ్గర పుండ్లు ఏర్పడి, పులిపిరి పోయి ఏర్పడిన పుండ్లు నెమ్మదిగా మానిపోయాయి. ఆ విధంగా 5, 6 సార్లు చేసి మానేశాను. అయితే పుండ్లు కూడా కాలేదు. ఒక 3 నుండి 4 నెలల వ్యవధిలో ఎప్పుడో సదరు పులిపిర్లు ఊడిపోయాయి.

తరువాత ఎక్కడైనా కలిసిన వారికి ఈ విధంగా చేయమని చెప్పాను. చేశారు. అయితే అందులో అందరి పేర్లు వ్రాసుకొనలేదు. కనుక ఒకరిద్దరిని అడిగాను అది బాగా పనిచేసినట్లు చెప్పారు.

దీనివల్ల నాకుగాని, నేను చెప్పి ఈ వైద్యం చేయించిన వారికి గాని ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కలుగలేదు. అయితే ఇన్ని సంవత్సరాలుగా ఈ వైద్యం చేస్తున్నా, ఈ విధంగా చాలామందికి ఉపయోగపడేటట్లు, నాకు గుర్తింపు వచ్చేటట్లు ప్రపంచానికి తెలియజేసే 'పల్లె సృజన' వున్నదని తెలియదు. అయితే ఖమ్మంలో 'డబ్ల్యు.టి.ఓ.' వారు మా రైతు సదుపాయ కర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఇలాంటివి రిజిష్టర్ చేయించుకోవడానికి 'హనీబీఎపి' అనే సంస్థ ఒకటి వున్నదని, చెప్పడంతో, వారి ఫోన్ నెంబర్ కనుగొని ఫోన్ చేయడం జరిగింది. హనీబీఎపి కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారు వెంటనే స్పందించి నేను తయారు చేసిన ఈ మందును ప్రజల్లోకి తీసుకెళ్ళడం నాకు చాలా ఆనందంగా వుంది.

ఈ 'పల్లెసృజన' ద్వారా రిజిష్టర్ చేసుకుని నేను తెలుసుకున్న విషయాన్ని సమాజానికి ఈ విధంగా ఉపయోగపడే అవకాశం దొరికినందుకు చాలా సంతోషంగా వుంది. ●

***- కొనకంచి శ్రీనివాసరావు,***
*మంచుకొండ గ్రా., ఖమ్మం జిల్లా*
*ఫోన్ : 08742 - 277682*

## ప్రోత్సహించండి

మన గ్రామసీమల్లో ఇలాంటి ప్రయోగాలెన్నో వెలుగులోకి రాక మరుగున పడిపోతున్నాయి. పాఠకుల దృష్టికి ఇలాంటి ప్రయోగాలేమైనా వస్తే లేదా మదిలో మెదిలితే వాటిని సత్వరమే 'పల్లె సృజన' ద్వారా వెలుగులోకి తీసుకురండి. అందువల్ల ఆ ప్రయోగం చేసిన వ్యక్తి వెలుగులోకి రావడమే కాకుండా ఆ ప్రయోగాలు ఎంతోమందికి జీవనాధారం కూడా అయ్యే అవకాశమివ్వండి. మీ

**- ఎడిటర్.**

# ఇన్నోవేషన్ల వ్యాప్తికై స్టూడెంట్ క్లబ్బులు

**యువశక్తి**

హైదరాబాదు నగరానికి ప్రొ. అనిల్ గుప్తా ఆగమనాన్ని సద్వినియోగ పరచుకునే ఉద్దేశ్యంతో ఇన్నోవేషన్ల వ్యాప్తికై ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి క్లబ్బు (ఎ.పి.యస్.సి.ఎ.ఐ.) ప్రారంభించాలని నిర్ణయించడం జరిగింది. ఇందుకొరకు హైదరాబాదుకు చెందిన కళాశాలల అధ్యపక వర్గం, విద్యార్థులే కాక, నగరానికి చెందిన కళాశాలల వారిని కూడా ఆహ్వానించడం జరిగింది. ప్రభుత్వోద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లు సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నలుమూలల నుండి ఆహ్వానింపబడ్డ 18 మంది ఇన్నోవేటర్లు సమావేశానికి వచ్చారు. కొంత మంది ఇన్నోవేటర్లు తమతమ ఇన్నోవేషన్లను ప్రదర్శించడం కూడా జరిగింది. హైదరాబాదు లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ & ఫారిన్ లాంగ్వేజెస్ సంస్థకు చెందిన ప్రొఫెసర్ డి. వెంకట్ రావు గారి సౌజన్యంతో ఒక క్లాస్‌రూం వాతావరణం లో ఈ సమావేశం నిర్వహించబడింది. వారికి మా కృతజ్ఞతలు.

యదావిధిగా ఈ సమావేశం ఉత్సాహ భరితంగా సాగింది. ప్రొ. గుప్తా గారు నిర్ణీత సమయానికంటే గంట ముందుగానే విచ్చేసి సభకు హాజరైన ఇన్నోవేటర్లతో తమ సమయాన్నంతా గడిపారు. ఇందులో కొంత మంది కొత్తవారు కాగా మిగతావారు పాతవారే. పాత ఇన్నోవేటర్లు తమ కొత్త ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. జంట నగరాల నుండి వరంగల్ నుండి వచ్చిన 8 మంది ఇంజనీరింగ్ మరియు ఇతర కళాశాలల నుండి వచ్చిన అధ్యాపక వర్గం, విద్యార్థులతో సహా దాదాపు 50 మంది ఈ సమావేశానికి హాజరైనారు.




ఆంధ్రప్రదేశ్ హనీబీ కో-ఆర్డినేటర్ బ్రిగేడియర్ గణేశం గారు హనీబీ ఏపి మొదలు పెట్టిన 18 సంవత్సరాలలో సాధించిన ప్రగతిని సభ్యులకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేటర్లు పేటెంట్ సాధించే ప్రక్రియ, వారికి సంబంధించిన ఇతర సమస్యల సాధన వేగవంతం చేయుటకు సహకరించాల్సిందిగా వీరు ఎన్.ఐ.ఎఫ్‌ను కోరారు. ప్రతి సంవత్సరం 100 విద్యార్థి క్లబ్బులు ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని హనీబీఏపి సాధించడానికి అందరి సహకారం కోరారు.

వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక వర్గం, ఇతరుల సమక్షంలో యస్.సి.ఐ.ఎ.పి.ని బ్రిగేడియర్ గణేశం గారు, ప్రొఫెసర్ అనిల్ గుప్తాగారు లాంఛనప్రాయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు ప్రొపెసర్లను విద్యార్థులను ఉత్తేజ పరచారు. రాబోయే 6వ పోటీకి 5000 కొత్త పద్ధతులను, కొత్త ఆలోచనలను పంపాలని సూచించారు. 4 రకాల కార్యక్రమాలు చేపట్టడానికి విద్యార్థులు క్లబ్‌లో చేరాలని కోరారు. 1. ఆలోచనలు, 2. ఆలోచనలను శోధించుట, 3. సమస్యలను తెలుపుట, 4. గ్రాండ్ పేరెంట్స్‌ని కలుసుకొనుట.

ఈ సంవత్సరం జూన్ నెలలో కాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో జరిగిన శోధయాత్ర అద్భుత అనుభవాలను ప్రొఫెసర్ గారు సభికులకు వివరించారు.

శ్రీ బంగారు రాజు, ఉప్పుటేళ్ళ క్రిష్ణ, చంద్రశేఖర్, దొరబాబు లాంటి కొందరు ఇన్నోవేటర్లు, హనీబీ ఏపీతో తమ అనుభవాలను తమ ఇన్నోవేషన్‌లు, భవిష్యత్ కార్యక్రమాలు సభికులకు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన





అధ్యాపకులు, విద్యార్థులు హనీబీఏపి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడానికి ఆసక్తి కనబరచారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ఒ.యస్.డి. అయిన శ్రీ ఎల్లారెడ్డి గారు, రాష్ట్రంలో మైక్రో ఇరిగేషన్ పథకాలు ఏ విధ,గా అమలౌతున్నాయో తెలిపారు. నల్లగొండ జిల్లాలో ఈ పథకం క్రింద వందల ఎకరాలలో బత్తాయి తోటల పెంపకం జరుగుతుందని, అచటి నుండి వచ్చే బత్తాయి కాయలను కొని రైతులకు లాభం చేకూర్చాలని కోరారు. శ్రీ దుర్గా ప్రసాద్ పారిశ్రామికవేత్త హనీబీఏపి వాలెంటీర్ మాట్లాడుతూ, ఇన్నోవేటర్లు తమ ఆలోచనలను వ్యాపార వేత్తలకు తెలియజేసే ఒక వేదికను ఏర్పాటు చేయాలని కోరారు. సభలో పాల్గొన్న విద్యార్థులు మాట్లాడుతూ, తమకు సంఘసేవ గురించిన అవగాహన, అనుభవం ఏది కలగడం లేదని కనుక సంఘసేవను పాఠ్యాంశంగా చేయాలని, అందుకు ఎన్.ఐ.ఎఫ్. ఈ విషయంలో నిర్ణయాలు తీసుకునే వేదికలను ప్రభావితం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా హనీబీఏపి కొత్త సంచికను అందరికి అందజేశారు. ఇంగ్లీష్, తెలుగులో ముద్రించిన 6వ క్యాంపేన్ పోస్టర్లను సభా ప్రాంగణంలో ప్రదర్శించారు. తెలుగు టైటిల్స్‌తో తయారు చేయబడ్డ సి.డి.లు కూడా పాల్గొన్న వారికి అందించారు.

భోజనాల సమయంలో అందరూ కలిసి మెలిసి ముచ్చటిస్తూ గడిపారు. ప్రొఫెసర్ గుప్తా గారి మాటల్లో ఈ మీటింగు ద్వారా చాలా ఉత్తేజం పొందారు. త్వరలోనే మరింత ప్రభావితం చేయగలుగుతాం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

భోజనానంతరం ఇన్నోవేటర్లు వాలంటీర్లు విస్తృతంగా చర్చించుకొన్న దానినుండి వెలువడిన ముఖ్యమైన అంశం ఏమిటంటే పేటెంట్లు పొందడానికి మార్కెట్ లోకి ప్రవేశంచడానికి చాలా ఆలస్యం అవుతుందని. గడచిన 18 నెలల్లో ఒక్క ఇన్నోవేషన్ కూడా మార్కెట్‌లో ప్రవేశించలేదని దీనివల్ల ఇన్నోవేటర్లు నిరాశా నిస్పృహలకు లోనౌతున్నారని బాధపడ్డారు. ఇవన్నీ దృష్టిలో వుంచుకొని ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

– ఇన్నోవేటర్ల సంఘం ఒకటి ఏర్పరచుకోవాలి.

– తమతమ ప్రాంతాల్లో ఇతర ప్రాంతాల వారి ఇన్నోవేషన్ల అమ్మకాలకు సహాయ సహకారాలు అందించాలి.

– రకరకాలైన ఇన్నోవేషన్లకు పేటెంట్లు, లైసెన్సులు పొందడానికి అమ్మకాల పెరుగుదలకు సలహాదారులను ఏర్పరచుకోవాలి.

ఈ బాధ్యతలను స్వీకరించడానికి హనీబీఏపి ఒప్పుకొని, ఈ నిర్ణయాలను ఎన్.ఐ.ఎఫ్. సహకారంతో ఇతర సంస్థలతో అమలు చేయడానికి నిర్ణయించింది.

కార్యక్రమం రాత్రి 11 గంటలకు ముగిసింది. ●

# చలం సృష్టి - పాటల పెన్ను

పిల్లలు హోం వర్క్ చేస్తున్నప్పు డు, వరసగా ఏదైనా వ్రాయవలసి వచ్చినప్పుడు బోరు ఫీలవడానికి అవకాశం ఉంటుంది. ఆ సమయంలో వారి వర్కుకు అంతరాయం కలగకుండా ఏదైనా మనోరంజకం కల్పిస్తే ఎలా వుంటుంది?



డా॥ ఎ. చలం గారు తిరుచానూ రు, చిత్తూరు జిల్లా నివాసి. ఈయన వృత్తి ఆయుర్వేద వైద్యం. అయినా ఎల్లవేళలా చుట్టూ వున్న చిన్న చిన్న సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలు సూచిస్తారు. ఆయన హనీబీఏపికి ఒక వరం.. వారానికో క్రొత్త ఆలోచనతో మమ్మల్ని దిగ్భ్రాంతులను చేసారు. అందులో ఒకటి 'పాటల పెన్ను'

పెన్నుల్లో ఇంకు, రీఫిలే కాకుండా నర్సరీ రైమ్స్, చిన్న పాటలు వగైరాలతో రికార్డయిన చిన్న చిప్‌ను పెట్టాలి. పెన్ను వాడినప్పుడల్లా ఈ రిథమ్స్ వినపడుతూ వుండాలి. వద్దనుకుంటే ఆపేయవచ్చు కూడా. ప్రస్తుతం వాడుకలో వున్న పెన్నులో ఏలాంటి అదనపు (వాల్యూ అడిషన్) ప్రయోజనాలు లేవు. చలంగారి 'పాటల పెన్ను' బహుశా టీచర్లకు తల్లిదండ్రులకు, పిల్లలకు కూడా నచ్చుతుందని ఆశిద్దాం! ●

ప్రగతి

# ఐ.టి. పల్లె బాట పడితే!

- యం. నాగరాజు, బి.టెక్,
నారాయణపురం, నల్గొండ జిల్లా

శ్రీయుత గౌరవనీయులైన ఎడిటర్ డా. కె.ఎల్. రావు గార్కి మరియు హనీబీ సంస్థ నిర్వాహకులకు నమస్కరించి వ్రాయునది. మీరు చేస్తున్న కృషికి మా పల్లెవాసులం ఎంతో ఋణపడి వున్నాం. ఈరోజుల్లో రాజకీయాలు, నాయకులు ఎన్నో హామీలతో ఎన్నికల ముందు దర్శనమిచ్చి వెళ్తున్నారు. కాని ఈ పల్లె సీమల బాధలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుంటున్నాయి. అడుగడుగునా గ్రామాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇలాంటి సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని సృజనలను, సాంప్రదాయ విజ్ఞానాన్ని వెలికితీసి, క్రోడీకరించి వాణిజ్య అవకాశాలను పెంపొందిస్తున్నందుకు మీ (మా) హనీబీ సంస్థకు మా నమస్సుమాంజలి.

భారత జనాభాలో మూడు వంతుల జనాభా గ్రామాల్లోనే ఉంటున్నారు. కనుక గ్రామీణాభివృదిధపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంది. నేటి పేపర్లలో రోజూ ఐ.బి.ఎం., ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్ వంటి ఐ.టి. సంస్థలు కోట్లానుకోట్ల రూపాయల పెట్టుబడి అంటూ, దేశాభివృద్ధి అంటూ పుంజుకుంటున్నాయి. కాని అవి కించిత్తు కూడా పల్లెవాసులకు ఒరగబెట్టడం లేదు. కాని ఒక్క నిజం మాత్రం రాజకీయాలు, ప్రభుత్వాలు తెలుసుకోవాల్సి వుంది. గాంధీ కల 'ఎప్పుడైతే గ్రామాలు వృద్ధి చెందుతాయో అప్పుడే నిజమైన అభివృద్ధి' అప్పటివరకు ఎన్ని ఐ.టి. అద్భుతాలు జరిగినా గ్రామీణులకు ఒరగపెట్టేదీ ఏమీ లేదు.

మాది నల్గొండ జిల్లా నారాయణ పురం గ్రామం. మా ఊర్లో రైతులు వ్యవసాయంలో ఎన్నో కష్టాలు పడుతున్నారు. సమయానికి విత్తనాలు చల్లినా, మందులు వేసినా సరైన దిగుబడి రాక, కొందరు పొలం అమ్ముకొని ప్రక్కన బస్తీలో కూలి చేసుకోవటానికి వెళ్తున్నారు. దీనికి ముఖ్య కారణం నిరక్షరాస్యత. అయినప్పటికి వారిలో చాలా తెలివైన వారు ఉన్నారు. మా ఊరిలో నన్ను ఆశ్చర్యానికి గురి చేసిన కొన్ని తెలివైన మా పల్లెవాసుల అద్భుతాలు నేను ప్రస్తావించా లనుకుంటున్నను.

మొలకెత్తిన వరిగింజలు పొలంలో చల్లిన 15 రోజుల వరకు కొంగలు, పిట్టలు, ఎలుకల బెడద ఎక్కువగా వుంటుంది. మా పూర్వకాలంలో రోజు మొత్తం ఒక మనిషి ఆ పొలం దగ్గర ఉండి, ఒక డబ్బాని శబ్దం చేస్తూ వాటిని రానివ్వకుండా చేస్తుండేవారు. కాని ఈ మధ్య మా పల్లెవాసులు దీనికి విముక్తి కనిపెట్టారు. అది ఏమిటంటే పనికిరాని టేప్ రికార్డర్ క్యాసెట్ లోని రీలును మడి చుట్టు కర్రలు పాతి వాటికి చుడుతున్నారు. ఈ రీలు చిన్న గాలికి కూడా ఎక్కువ శబ్దం చేస్తూ తళుకులీనుతూ ఊగటంతో పిట్టలు, ఎలుకలు అక్కడకు రావటానికి భయపడుతున్నాయి.

మా నాన్నగారి పేరు వెంకటేశ్వర్లు (వెంకటి) ఏమీ చదువక పోయినా పంట దిగుబడి రావటంలో ఎన్నో మెలకువలు పాటిస్తాడు. అంతేగాక వాటి గురించి పొరుగు వారికి తెలియజేస్తాడు. ఈమధ్య కాలంలో అలా ఆయన ఎన్.జి. రంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను అబ్బురపరచే విషయం కనిపెట్టాడు. దీన్ని 'ఈనాడు' పేపర్లో ప్రచురించింది మా బంధువు పొన్నుస్వామి. కాని నిజానికి ఈ పద్ధతిని మా నాన్న అతనికి చెప్పి యుండెను. అతడు మా నాన్న చెప్పిన విధంగా చేసి అద్భుతమైన పంట పండించుకుంటున్నాడు. అది ఏమిటంటే....

నేడు వేలకు వేలుపోసి రసాయన క్రిమి సంహారకాలు కొన్ని వాడినా పురుగు చావదు, చీడ వదలదు. పైగా ఉత్పత్తులకు, పర్యావరణానికి హానికరం. ఈ పురుగు బెడదనుండి మా నాన్న ఒక "మిశ్రమ సేంద్రియ చేదు ద్రావణం" తయారు చేశాడు. అది ఇలా తయారవుతుంది.

వేప గింజలు, జత్రోపా గింజలు, కానుగ గింజలు, ఎండు సీతాఫలాలు అన్ని ఒక్కొక్కటి 250 కిలోల చొప్పున తీసుకొని కలిపి పొడి చేయాలి. దీనికి కిలో మిశ్రమానికి ఒక కిలో 'బి' బాక్టీరియా కలపాలి. ఈ పూర్తి మిశ్రమాన్ని మరో నెల రోజులు మగ్గనివ్వాలి. దీంట్లోంచి 20 కిలోలు తీసుకొని బెల్లం నీటిలో కలపాలి. దీనిని పదిరోజులు నిల్వచేసి, ఆ తదుపరి వడగట్టి వాడాలి. పది లీటర్ల మందుకు, పది లీటర్ల శుభ్రమైన నీరు కలిపి పైరుపై పిచికారి చేయాలి. దీనిని పది రోజులకోసారి చల్లితే మంచిది. దీనితో ఆ ఆకులను పురుగులు ముట్టుకోవు. దీని పురుగుకు పడని చేదు మందువుండటం వల్ల పురుగు నుండి విముక్తి అని ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త శశిభూషణ్ తేల్చి చెప్పారు. మరియు ఇది గొప్ప పద్ధతి అని కూడా అన్నారు.

అంతే కాకుండా ప్రతి వేసవికాలం క్రమం తప్పకుండా ఎండిన చెరువులోని మట్టిని పొలంలోకి తోలుకుంటారు. దీనివల్ల చెరువు పూడిక కూడా తొలిగినట్లు అవుతుంది. మరియు ఆ మట్టిలో ఉన్న ఎన్నో పోషకాలు పంటకు తోడ్పడుతాయి.

ఈ విధంగా మా పల్లెల్లో కూడా ఒక చిన్నపాటి శాస్త్రవేత్తలు ఉన్నారని గర్వంగా చెప్పుకుంటున్నాము. నేడు ఐ.టి. రంగంలో వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. కాని నేడు రైతుకు కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల పాలవుతున్నారు. కొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరికొందరు ఇంతవరకు నిరాదరణకు గురవుతూ వచ్చిన పల్లె ప్రజలకు అంతరిక్ష పరిజ్ఞానంతో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలతో చోటు చేసుకున్న ప్రగతి గ్రామీణాభివృద్ధికి అనుసందానం చేయాల్సి వుంది. మరియు సాంకేతిక పరిజ్ఞానం అయిన కమ్యూనికేషన్ శాటిలైటు, రిమోటు సెన్సింగ్ శాటిలైట్లు గ్రామ ప్రజలకు మేలు చేయాలి. భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణానుకూలంగా వుండాలి. అప్పుడే గ్రామీణోద్ధరణ సాధ్యమవుతుంది.

ఇక మీనుంచి సాధ్యమైనంత వరకు మీరు గ్రామాల ప్రజలకు చేస్తున్న మేలుకు కృతజ్ఞతలు. ఇక రాబోయే రోజుల్లోనైనా గ్రామ ప్రజల కళ్ళల్లో కాంతులు వస్తాయని ఆశిద్దాం. ●

స్వగతం

# నా అహ్మదాబాద్ అనుభవాలు - 2



– బంగార్రాజు, శ్రీశైలం

నల్లమల! ఆంధ్రప్రదేశ్‌లో పవిత్రమైన కృష్ణానది తనగుండా ప్రవహిస్తూ నాలుగు జిల్లాలకువిస్తరించి అమూల్యమైన ఔషధాలకు నిలయమై అనాదిగా జీవిస్తున్న ఆదివాసి తెగ "చెంచు"లకు పుట్టినిల్లు మా నల్లమల. ఎత్తయిన కొండలు, నల్లటి బండరాళ్లు, జంతుజాలాలు, పక్షుల కిలకిల రావాలు, అక్కడక్కడ మనోహరమైన మైదనాలతో ప్రకృతికి మరోపేరు నల్లమల. అటువంటి నల్లమలకు నడిబొడ్డులో ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన, చరిత్రలో తనదంటూ పేరు కల్గిన శివక్షేత్రం శ్రీశైలం! శ్రీ మల్లిఖార్జున స్వామి, భ్రమరాంబికా దేవి కొలువు తీరిన మహా పుణ్యక్షేత్రం. ఆ క్షేత్రానికి పవిత్రత కృష్ణమ్మ పరవళ్లు! ఆ పరవళ్లకు ఆనకట్ట వేసి మానవుని పురోగతికి మూలాధారమైన నీలం సంజీవరెడ్డి సాగర్ జలవిద్యుత్తు ప్రాజెక్టు ఆంధ్ర రాష్ట్రానికే గర్వకారణం.

కనులారా తిలకిస్తేనే గాని వర్ణించనలవికాని అడుగడుగునా దర్శనమిచ్చి సేదతీర్చే ప్రకృతి దృశ్యాలు, ప్రకృతి సంపదలే అనాదిగా చెంచుల యొక్క స్థిరాస్తులు. అవి తప్ప వారికి వేరే ఏ సిరి సంపదలు లేవు. అవసరం లేదు కూడా. ఎ.టి.ఎం.లో డ్రా చేసుకున్నట్లే ఏ పూట ఆహారం ఆ పూట ప్రకృతి మాత నుండి సేకరించుకుని తిని మిగిలినవి అందరికీ పంచుతారు. ఒకరికి ఇచ్చే గుణమే తప్ప ఎవరినీ ఏదీ అడుక్కునే సంప్రదాయం లేని తెగవారు 'చెంచులు'. వారి అభ్యున్నతికి గిరిజన సంక్షేమ శాఖ వారి ద్వారా సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐ.టి.డి.ఎ.), శ్రీశైలం వారు గత 20 సంవత్సరాలుగా గృహ, విద్య, వైద్య, సాంకేతిక, సాంస్కృతిక మొదలైన వివిధ అభివృద్ధి పథకాల ద్వారా కృషి చేస్తున్నారు. అటువంటి పథకాలలో ఒకటైన వొకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చీఫ్ ఇన్‌స్ట్రక్టరుగా పనిచేస్తూ చెంచులకు సేవ చేసే మహద్భాగ్యాన్ని అప్పటి ప్రాజెక్టు అధికారి, ఇప్పటి జాయింట్ డైరెక్టర్ (ప్రణాళికా విభాగం) శ్రీ వాడ్రేవు చినవీరభద్రుడు గారు కల్పించారు.

మొదటిసారి అహ్మదాబాదు వెళ్లినపుడు హనీబీఎపీ ద్వారా నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ కు చెంచులను కూడా పరిచయం చేయాలన్న ఆలోచన కల్గింది. ఈ ఆలోచన నేషనల్ ఫుడ్ ఫెస్టివల్‌కు చెంచులను తీసుకు వెళ్లాలన్న కోరికగా మారింది. చెప్పిందే తడవుగా శ్రీ గణేశం గారు, డా. కె. అనిల్ గుప్తా గారు మరియు ఏ.టి.డి.ఏ. శ్రీశైలం ప్రాజెక్టు అధికారి ఈసా రవీంద్రబాబు గారు తమ సుముఖతను పూర్తి సహకారాన్ని అందజేశారు. ఆ బాధ్యతను నాపైనే మోపారు. కర్నూలు జిల్లా నుండి శ్రీమతి విజయలక్ష్మి (కొట్టాల చెరువు), ప్రకాశం జిల్లా నుండి శ్రీమతి వెంకటమ్మ (తుమ్మల బయలు), మహబూబ్‌నగర్ జిల్లా నుండి శ్రీమతి చిట్టెమ్మ (జంగంరెడ్డి పల్లి)లను ఫుడ్ ఫెస్టివల్ కాంపిటీషన్‌కు ఎంపిక చేసి వారి ద్వారా చెంచుల ఆరోగ్యప్రదమైన ప్రకృతి నుండి సేకరించిన వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి, బాహ్య ప్రపంచానికి రుచి చూపించడానికి నిర్ణయించుకున్నాము.

సమయాభావం కారణంగా ఆ ముగ్గురినీ తీసుకొని ఎయిర్ డెక్కన్ విమానం ద్వారా హైదరాబాద్ నుండి అహమ్మదాబాద్ చేరుకున్నాము. విమానం ద్వారా చెంచు మహిళలు ప్రయాణం చేయడం నాకు తెలిసి ఇదే ప్రథమం. నాకు కూడా ఇదే మొదటి అనుభవం.



అక్కడ విమానాశ్రయం నుండి నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వారి కారు ద్వారా మమ్మల్ని మహాత్మా గాంధి ఇన్నోవేషన్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ అతిథి గృహంలో వేర్వేరుగా వసతులు కల్పించారు. మేము నల్లమల నుండి సేకరించుకుని తీసుకు వెళ్లిన ప్రకృతి ప్రసాదమైన పుల్లకూరలతో కూరలు, జొన్నరొట్టె, రాగి సంకటి, రాగి జావ, పకోడీలు తయారు చేసి మాకు కేటాయించిన స్టాలులో ప్రదర్శించాము. 'సృష్టి' సంస్థ వారి సహకారంతో మేము తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి వాటి ప్రాశస్త్యాన్ని వివరించాము. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వారి వివిధ రకాల వంటకాలలో ఆంధ్రప్రదేశ్ నుండి మొట్టమొదటి సారిగా ఆదివాసీలైన చెంచుల ఆహార అవాట్లను, ఆరోగ్య పరమైన అంశాలను దేశవ్యాప్తంగా చాటాలనే తపనతో ఆ చెంచు మహిళలు వచ్చీరాని భాషతో, వివిధ హావ భావాలతో వారు వ్యక్తీకరించే ఆ సన్నివేశ దృశ్యం మరువలేనిది. వారిని బయటి ప్రపంచానికి పరిచయం చేయడంలో సఫలీ కృతుల మయ్యాము. ఈసారి ఫుడ్ ఫెస్టివల్ కు హాజరయితే ఎన్ని విధాల లాభాలో వారే వివరిస్తుంటే వారికి సారథ్యం వహించిన నాకు ఆనందంలో మేను పులకరించింది.

కొసమెరుపుగా చివరిరోజు బహుమతి ప్రదానోత్సవంలో మొదటిగా మన ఆంధ్రప్రదేశ్ చెంచు మహిళలకు బహుమతి ప్రదానం మన సాంప్రదాయ వంటకాలకు లభించిన గౌరవం. రైలులో తిరుగు ప్రయాణం మొత్తం ఖర్చులన్నీ ఐ.టి.డి.ఏ. శ్రీశైలం మరియు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, అహ్మదాబాద్ వారు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడానికి తమ పూర్తి సహకారాన్ని అందించిన కమీషనల్, శ్రీ ఆర్. రామక్రిష్ణయ్య, గిరిజన సంక్షేమ శాఖ, జాయింట్ డైరెక్టర్ శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు గార్లకు నా ప్రత్యేక ధన్యవాదములు.

అన్ని రాష్ట్రాల నుండి దేశ వ్యాప్తంగా కొన్న లక్షల మందికి అందరి ఆహారపు అవాట్లను, రుచులను పరిచయం చేయాలన్న సూత్రధారి డా. కె. అనిల్ గుప్తా గారి బృహత్తర సంకల్పానికి నా ప్రణామములు. ఈ కార్యక్రమాన్ని విజయవ,తంగా ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించిన 'సృష్టి' అహ్మదాబాద్ వారికి, ఐ.ఐ.ఎం., అహ్మదాబాదు వారికి, ఐ.టి.డి.ఎ. స్టాఫ్‌కి, హనీబీఎపి రిటైర్డ్ బ్రిగేడియర్ శ్రీ గణేశం గారికి నా కృతజ్ఞతాభివందనములు. మరికొన్ని అనుభవాలను త్వరలో మీముందుకు వస్తాను. ●

# స్పందన

ఎడిటర్ గారికి,

నాకు చర్మంపై 'పులిపిర్లు' బుడిపెల మాదిరిగా అయినవి. వాటికి నేను ఒక చెట్టు నుండి తీసిన పేస్టులాంటి పదార్థాన్ని ఆ బుడిపెలపై వాటిని గీరి ఆ బుడిపెలపై రాసాను. ఆ విధంగా రోజు విడిచి రోజు ఏడుసార్లు వాడాను. అవి 3 నెలల వ్యవధిలో వాటంతట అవే రాలిపోయాయి. ఈ సంఘటన 9 సంవత్సరాల క్రింది మాట. దీని ఆధారంగా నేను చాలామందికి ఈ విధంగా చేసాను. తగ్గిపోయాయి. కానీ నాకు ఎన్.ఐ.ఎఫ్. ఒకటి వున్నదని ఇలాంటివి అక్కడ ప్రయోగాత్మకంగా నిరూపించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందవచ్చునని మాకు ఇటీవల 'ప్రపంచ వాణిజ్య సంస్థ అవగాహన సంస్థ' వారు ఏర్పాటు చేసిన 'రైతు సదుపాయకర్తల శిక్షణ' కార్యక్రమంలో తెలియజేశారు. కావున నాకు తెలిసిన ఈ విషయాన్ని నిరూపించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాలని ఆశిస్తున్నాను.

**– కొనకంచి శ్రీనివాసరావు,** మంచుకొండ, ఖమ్మం.

**మీలాంటి ఔత్సాహిక ఇన్నోవేటర్లకు 'పల్లెసృజన' ఎప్పుడూ వెన్నంటి వుంటుంది. మీ ప్రయోగాలు "జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శన' లో నేరుగా చూడడం జరిగింది. మీరు చేసే వైద్య పద్ధతి సర్వత్రా వ్యాప్తి కావాలని ఆశిస్తున్నాం.** – ఎడిటర్

*****

ఎడిటర్ గారికి,

మేము మీ పత్రిక చందాదారులమై యున్నాము. ఇదివరకు పత్రిక క్రమం తప్పకుండా మాకు అందేది. అయితే ఆగస్టు – అక్టోబర్–2006 తర్వాత మాకు పత్రిక అందలేదు. కావున మీరు ఈ విషయమై పత్రిక పంపడం గురించి మాకు తెలుపగలరు.

**– యన్. అనంతం,** రాజమండ్రి

**మీకు సక్రమంగా పంపిస్తున్నే వున్నాం. ఇప్పుడు మరో కాపీ పంపించాం. భవిష్యత్తులో మీకు సకాలంలో పత్రిక అందే ఏర్పాటు చేస్తాం.** – ఎడిటర్.

*****

ఎడిటర్ గారికి,

జనవరి – మార్చి 2007 సంచిక చాలా ఉపయోగకరంగాను, ఉపయుక్తంగానూ వుంది. పల్లె సృజనకు మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేసుకుంటూ, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

**–ఎల్.ఎస్.ఎన్. రెడ్డి,** సంస్థాపక అధ్యక్షులు, గ్రామీణ వికాస సమితి, తిరుపతి.

**మీ ఆదరణకు ధన్యవాదములు** – ఎడిటర్.

*****

ఎడిటర్ గారికి,

నిజామాబాద్ శోధ యాత్ర ఒక మరువరాని రోజుగా ఈ నా జీవితంలో నిలిచిపోతుంది. హనీబీఏపి చేపట్టిన ఈ శఓధయాత్ర అంటే నేను ఎప్పుడూ చూడలేదు. ఈ యాత్రలో నేను చూసిన ఇన్నోవేషన్లు, కలిసిన ఇన్నోవేటర్లు కాని నాకెప్పుడూ తటస్థ పడలేదు. నా ప్రక్క ఊళ్ళోనే వున్నా వీరి గురించి నాకెప్పుడూ తోచలేదు. ఇలాంటి నూతన దృష్టి కోణాన్ని మాకు అనుభవించే అవకాశం కల్పించిన మీకు మా ధన్యవాదములు. భవిష్యత్తులో కూడా నాకు మీ శోధయాత్రలో పాల్గొనాలని ఉన్నది. అవకాశం కల్పిస్తారని ఆశిస్తూ నమస్కారములతో.... **– స్రవంతి,** ఇంజనీరింగ్ విద్యార్థి, నిజామాబాద్.

**అవకాశమున్నప్పుడు మిమ్మల్ని తప్పక ఆహ్వానిస్తాం.** – ఎడిటర్.

*****

ఎడిటర్ గారికి,

ఈరోజు మీతో గడిపిన ఏడు గంటలు మరువలేనివి. మాకెన్నో విషయాలు తెలిశాయి. మా చుట్టు ప్రక్కల గ్రామాల్లో ఉన్న అద్భుత క్రియాత్మ శక్తిని మాకు పరిచయం చేశారు. ఒక నూతన దృక్పథంతో గ్రామీణ ప్రజలను చూపించారు. మీలాంటి మంచి వ్యక్తిని కలసి ఈ మినీ శోధయాత్రలో పాల్గొన్నందుకు మేము ఎంతో సంతోషిస్తున్నాము. **– సౌమ్య, స్వాతి,** ఇంజనీరింగ్ విద్యార్థులు.

# కదలిరా రైతన్నా!

కదలిరా రైతన్నా! కదలి రావాలన్నా!
పలకాలి నీనోట పలుమార్లు పల్లెసృజన


మనచుట్టూ ఎన్నెన్నో మహిమలు దాగున్నాయి
దాగిన ఆ మహిమలకు దారులు వెతకాలి మనం !!కదలిరా!!

సాంప్రదాయ పరిజ్ఞానాన్ని పరిశోధించే దిశలో
సాగాలి నీ శోధన సామాజిక స్ఫూర్తితోటి !!కదలిరా!!

ఆకుల్లో దాగున్నాయి ఔషధ గుణాలెన్నో
తేనెటీగ చేస్తుంది తెలివైన పనులెన్నో !!కదలిరా!!

సృజనాత్మక శక్తితోటి వేయాలి ముందడుగు
జీవన వైవిద్యాన్ని అనుభవంతో జతచేయు !!కదలిరా!!

అవరోధాలెన్నున్నా అన్వేషణ సాగించు
అందరికీ అప్తుడవై ఆదర్శంగా నిలువు !!కదలిరా!!



రచన :
**బి. నాగేశ్వర రావు,**
సంగారెడ్డి

"కదరిలిరా రైతన్నా" అంటూ పల్లె సృజనకోసం అక్షర సుమగీత మాలను అందించిన శ్రీ బి. నాగేశ్వర రావుగారు మెదక్ జిల్లా పుల్‌కల్ మం, గ్రా. శివంపేట సి.పి.ఎస్. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం రేగోడ్ మండలంలోని దేవునూర్ గ్రామం. వీరికి ఘంటసాల పాటలంటే ఇష్టం. భక్తిగీతాలు పాడేవారు. వీరు తొమ్మిదో తరగతిలో ఉన్నపుడు జరిగిన ఒక ఆసక్తికర సంఘటన స్ఫూర్తితో పాటలు రాయడం మొదలు పెట్టారు. అప్పటినుండి అవి పాటలు వ్రాస్తూనే వున్నారు. ఇప్పటివరకు సుమారు 50 పాటల వరకు వ్రాశారు. జన్మభూమిపై, చన్నపిల్లలపై, కృష్ణునిమీద, పతంజలి యోగమీద, విద్యపై ఇంకా పదవీ విరమణ వీడ్కోలు సన్మానగీతాలు కూడా వ్రాశారు. వీరి ప్రత్యేకత ఏమిటంటే పాటలు రాయడమే కాక స్వయంగా పాడతారు కూడా.

"ధ్యానము చేయుమురా మానవా
యోగము నేర్వుమురా
పతంజలి యోగపీఠము ద్వారా ప్రాణామాయము నేర్చి చూడరా"

అంటూ 'యోగ' విశిష్ఠతను చాటి చెబుతారు. వీరికి కృష్ణునిమీద వ్రాసిన పాటలంటే ఇష్టం. కృష్ణాష్టమినాడు శంకరంపేటకు వెళ్ళి వీరు చేసే గోపాల బాలుడి భజనలు, గీతాలు విని తీరవలసిందే.

"వలదు వలదు కన్నయ్యా పోవలదు కన్నయ్యా
నిను చూడక ఈ అమ్మ ఎలా బ్రతకగలదయ్యా"

అంటూ చిన్ని కృష్ణుని విడవలేక చెరసాలలో రోధించే ఆ కన్నతల్లి వేదనను కళ్ళముందు ఆవిష్కరింపజేస్తారు. "పల్లెసృజన" కోసం చక్కటి పాటను అందించిన నాగేశ్వర రావు గారికి 'హనీబీఏపి' యంత్రాంగం తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతోంది.

– జె. కిషన్ పవార్, సంగారెడ్డి

'హనీబీఏపి' అంతరాత్మ

# పల్లె సృజన

'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' సంస్థ లక్ష్యాలను సాధించటానికి 'హనీబీ' (తేనెటీగ) అనే పేరుతో ఒక యంత్రాంగం రూపొందించబడ్డది. తేనెటీగ అత్యుత్తమ నిస్వార్థ ప్రాణి. పూలల్లో వున్న మకరందాన్ని ఆస్వాదించి, తన శ్రమతో దాన్ని తేనెగా తయారు చేసి మానవాళికి అందజేస్తుంది. పూవుకు నష్టం కాకుండా, ప్రజానీకానికి లాభమయ్యేటట్లుగా చాకచక్యంతో కార్యాన్ని నిర్వర్తిస్తుంది. ఈ తేనెటీగ జీవన సరళియే ఉద్దేశ్యంగా 'హనీబీ' స్వచ్ఛంద సంస్థ మరుగున పడివున్న గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయికంగా వాడే పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి కృషి చేస్తున్నది. ప్రజల నుండి మనం ఏదైనా జ్ఞానాన్ని సేకరించినపుడు, వారు గరీబులుగా మారకూడదు. వారి అంతరాంతరాల్లోని ఆలోచనల్ని మనతో పాలు పంచుకొన్నపుడు వారికి అంతో ఇంతో లాభం జరగడం సబబు. అందుకే మనం ఆ సరికొత్త ఆలోచనలు వారి స్థానిక భాషలో సంప్రదించాలి. వారికి తగిన సమాచార సామగ్రిని అందించాలి. సరికొత్త ఆలోచనలన్ని మనముందు వెల్లడిస్తున్న వ్యక్తికి ఆ ఆలోచనలలో మనమేమి చేస్తామో తెలియాలి. వారి పరిజ్ఞానాన్ని విస్తారం చేయడం ద్వారా ఎంతోకొంత ఆదాయాన్నిసమకూర్చాలి. ఇది వీలైనంత పారదర్శకంగా ఉండాలి.

ప్రజల మధ్య అభ్యాసానికి 'పల్లెసృజన' ఒక ప్రయోగం వంటిది. మనం ఇంగ్లీషులో రాస్తాము. అది ప్రపంచమంతటికి వ్యాపిస్తుంది. కానీ స్థానికులను పరాయి వారిని చేస్తుంది. మనం ఎక్కడినుండి నేర్చుకున్నామో అక్కడికి చేరుకోలేము. ఒకవైపు మనం ఎదుగుతూ ఉంటాం. కెరీర్‌లో ఒక్కొక్క శిఖరాన్ని అధిరోహిస్తాము. వృత్తి సంబంధమైన పురస్కారాల్ని అందుకుంటాము. ఇదే సమయంలో మన ఆలోచనలతో భాగస్వామి అయిన స్థానికుడు బాధలు పడతాడు. మౌనంగా వేదనకు లోనవుతాడు. విజ్ఞాన సేకరణ, దాన్ని పత్ర రూపంలో సిద్ధం చేయడం (డాక్యుమెంటేషన్) ఆ విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాప్తిలోకి తేవడం, వాటికి సిద్ధాంత రూపాన్ని కల్పించడం, సంస్థలకు పరిచయం చేయడం, నైతిక సూత్రాల పాటింపు, హనీబీ ఆలోచనల్లో ప్రధానమైనది. ఈ విజ్ఞానాన్ని విస్తారంగా వ్యాప్తం చేయడానికి 'పల్లెసృజన' తెలుగునాట కృషి చేస్తున్నది. ప్రాంతీయ సహ భాగస్వాముల చేయూతతో ఇప్పటికి ఆరు భాషల్లో ఇలాంటి ప్రచురణలతో వెలువడుతోంది. హనీబీఏపి యంత్రాంగానికి చేయూత నందించాలి అనుకున్నట్టయితే మీరు మా పత్రిక వార్షిక చందా లేదా జీవితకాలపు చందాతో ముందుకు రండి.

## చందా వివరాలు

| | రూ. |
|---|---|
| **సంవత్సర చందా** | |
| వ్యక్తిగతంగా | 100/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 1,000/- |
| **జీవిత చందా (15 సంవత్సరాలు)** | |
| వ్యక్తిగతంగా | 1,000/- |
| సంస్థ లేదా లైబ్రరీకి | 10,000/- |

**మీ చందాలను డి.డి. / మనీఆర్డర్ / చెక్కుల రూపంలో పంపవలసిన చిరునామా**

శ్రీమతి అరుణ గణేశం,
అసోసియేట్ ఎడిటర్, పల్లె సృజన
55, వాయుపురి, సైనికపురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27118555
e-mail : honeybeeap@gmail.com

# సునాయాసంగా చిన్న కాలువ త్రవ్వే యంత్రం

ఈ యంత్రం 60 హెచ్.పి. ట్రాక్టర్ సహాయంతో పని చేస్తుంది. దీనితో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చిన్న కాలువలను గాని, రహదారి నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపుల తీసే గుంతలను త్రవ్వడం చాలా సులభం. ఒక అడుగు వెడల్పు, 6 అడుగుల లోతు, ఒక కిలోమీటరు పొడవున్న కాలువను 12 గంటలలో త్రవ్వగలదు. లోతు 3 అడుగులైతే 6 గంటల్లో ఒక కిలోమీటరు త్రవ్వవచ్చు. ఈ పనిని ట్రాక్టర్ గంటకు 5 లేదా 6 లీటర్ల డీజిల్ సహాయంతో పని చేస్తుంది. ఈ యంత్రం ద్వారా ఇంకా మెరుగైన సేవలందించడానికి కృషి జరుగుతున్నది. దీని ఖరీదు రూ. 2.25 లక్షలు.

ఈ యంత్రం యొక్క ప్రత్యేకతలు : తక్కువ ఖర్చు, శ్రమ తక్కువ, సులభమైన పద్ధతి. కేబుల్స్, పైపులు వేయడానికి మన దేశంలో సులభంగా చౌకగా ఉండే పద్ధతి. ఎండలో కూలీలు శ్రమపడి త్రవ్వే దానికన్నా చౌక, సులభం. ఆరు అడుగుల వరకు త్రవ్వవచ్చు. చిన్న కాలువ వెడల్పు మనకు అవసరాన్ని బట్టి మార్చవచ్చు. ఈ యంత్రాన్ని కావలసినప్పుడు ట్రాక్టరుకు సులభంగా అమర్చి విడదీయవచ్చు.

ఈ యంత్రం ఒక నెలలో తయారు చేసి, ట్రాక్టర్‌కు అమర్చవచ్చును. ఈ యంత్రాన్ని తయారు చేసిన గ్రామీణ ఇన్నోవేటర్ శ్రీ మహమ్మద్ యూసుఫ్ ఖాన్ గారి సెల్ నెం. 093413 86786 (రాజస్థాన్) ఫోన్ చేసినచో, ఈ యంత్రం వివరాలు గల వీడియో క్యాసెట్‌ను మీకు పంపగలరు. గ్రామీణ అవసరాలకు ఈ శోధన చాలా ఉపకరిస్తుందని 'పల్లెసృజన' ఆశిస్తోంది.

**సాంకేతిక వివరాలు**


**బరువు**
1 టన్ను (100 కిలోలు)

**పనిచేసే వెడల్పు**
12 అంగుళాలు (ఒక అడుగు)

**త్రవ్వకంలో ముందుకు సాగే వేగం**
గంటకు 30 మీటర్లు

**త్రవ్వే భాగం పొడవు**
12 అడుగులు

**చైను నియంత్రించే విధానం**
యాంత్రికం లేదా హైడ్రాలిక్ సిస్టం.



# గ్రామాల్లోని సాంకేతిక ఆవిష్కరణలను సాంప్రదాయ పరిజ్ఞానాన్ని శోధించే 6వ జాతీయ ద్వైవార్షిక పోటీలు

**ఈ పోటీ ఎందుకు? :** మన సమాజంలో దాగివున్న సృజనా శక్తిని వెలుగులోకి తెచ్చి, తద్వారా గ్రామీణప్రజల జీవన స్థాయిని పెంచాలన్న తపనే ఈ పోటీకి మూలం.

**ఎవరు పాల్గొనవచ్చు ?** । వృత్తిపరంగా, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల అనుభవం లేకుండా వృత్తిపరంగా తమతమ వ్యక్తిగత స్థాయిలో వినూత్న ఆవిష్కరణలు సాధించిన వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు, సమాజాలు. । మహిళలు, మహిళా సమూహాలు పాల్గొనవచ్చు. । విద్యార్థులు, నవ యువకులు వినూత్న విషయాల్ని ఆవిష్కరించినవి పంపవచ్చు. । గ్రామాల్లోని రైతులు, వృద్ధులు, అనుభవజ్ఞులు, పంటలకు, పశువులకు, ఆరోగ్యానికి సంబంధించిన ప్రయోగ సాఫల్యం అయిన ఆలోచనలు, ప్రక్రియలు పంపవచ్చు.

**ఎలాంటివి పంపవచ్చు? :** । ఆవిష్కరణలు ఉత్పత్తులను పెంచే విషయంలోను, కష్టాన్ని, నష్టాన్ని తగ్గించే విధంగానూ, వ్యవసాయ పరంగా రైతుకు లాభదాయకంగా ఉండే పద్ధతులూ, ఆలోచనలు ఆవిష్కరణలు ఈ పోటీకి పంపచవచ్చు. । ప్రకృతిలో లభించే చెట్టు ఆకులు, మొక్కల ద్వారా మనుష్యులకు, పశు సంతతికి, పంటలకు లాభాన్నిచ్చే ఆలోచనలు, ప్రయోగాలు పంపవచ్చు.

**ఏ విధంగా పాల్గొనవచ్చు? :** । వ్యక్తులు లేదా బృందాలు ఎన్ని ఎంట్రీలైన పంపించవచ్చు తెల్ల కాగితం మీద ఈ క్రింది వివరాలను నమోదు చేయడం అవసరం. 1. నూతన ఆవిష్కరణవిశిష్ఠత సంప్రదాయ విజ్ఞానం గురించిన వివరాలు, 2. నూతన ఆవిష్కరణకు దారి తీసిన నేపథ్యం. 3. నూతన ఆవిష్కరణల్ని ఆవిష్కరించిన వ్యక్తుల నేపథ్యం, వారి విద్యార్హతలను గురించిన పూర్తి వివరాలు, వీటితో పాటు ఒక ఫోటోగ్రాఫ్, వీలైతే అదనపు సమాచారంతో కూడిన వీడియోలు.

మొక్కలకు సంబందించిన వివరాలతో కూడిన ఎంట్రీలను కూడా పంపించవచ్చు. అయితే ఈ మొక్కల ఎండు భాగాలను నమూనాలుగా పంపించవలసి ఉంటుంది.

**బహుమతులు :**

| కేటగిరి | బహుమతులు (రూపాయలు) ప్రథమ | ద్వితీయ | తృతీయ |
|---|---|---|---|
| । తమ వృత్తులు నిర్వహించడానికి వినూత్న పద్ధతులను కనుగొన్నవారు | ఒక లక్ష | 50 వేలు | 25 వేలు |
| । వారి వృత్తులకు సంబంధించిన పరికరాలు, పనిముట్లు, యంత్రాలు, వృత్త సలభతరం చేసే ప్రయోగాలు కనుగొన్నవారు. | ఒక లక్ష | 50 వేలు | 25 వేలు |
| । విద్యార్థులు | 15 వేలు | 10 వేలు | 5 వేలు |
| । పరిశోధనలను వెతికి వెలుగులోకి తేవడానికి అసాధారణకృషి చేసిన వ్యక్తులు, సంస్థలు | 25 వేలు | 15 వేలు | - |
| । ఔషధ మొక్కల గొప్పతనాన్ని తెలియజేసిన వారు | 50 వేలు | 25 వేలు | 15 వేలు |
| । కన్సోలేషన్ బహుమతులు | 5 వేలు | | |

। అర్హులైన ఎంట్రీలకు ప్రశంసా పత్రాలు ఇవ్వబడును.

। అసాధారణఆవిష్కరణలను 'హనీబీ' మరియు అన్ని ప్రాంతీయ పత్రికల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తారు. ఎన్.ఐ.ఎఫ్. వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.

**పాల్గొనుటకు ఆఖరు తేది:** రెండు సంవత్సరాలకొకసారి నిర్విహింపబడు ఈ పోటీలో పాల్గొనుటకు చివరి తేది 31 డిశంబర్ 2008. ఇప్పటి వరకు ఇలాంటివి 4 పోటీలు నిర్వహింపబడి ఇది ఐదవ పోటీ.

ఎంట్రీలు పంపువారు తమ పూర్తి అడ్రస్‌ను వివరముగా రాయాలి. దానితో భవిష్యత్తులో ఉత్తర ప్రత్యుత్తరాలకు వీలౌతుంది.
"నేషనల్ ఇన్నోవేషన్ ఫైండేషన్" (NIF) వెబ్‌సైట్ www.nifindia.org లో మిగతా వివరాలన్ని పొందవచ్చు.

**ఎంట్రీలను పంపవలసిన చిరునామా :**

National coordinator
(Scouting and documentation)
National Innovation Foundation,
Satellite Complex, Bunglow No. I,
Premchand Road - Jodhpur Tekra,
Ahmedabad - Gujrat 380 015.

**వివరాలకు సంప్రదించండి :**

A.P. State Co-ordinator (Scouting and documentation)
HONEYBEE AP, 55 (GF), VayuPuri,
SainikPuri Post, Hyderabad - 500 094.
Ph. : 040-27118555, Mobile : 98660 01678.
E-Mail : Honeybeeap@gmail.com